# భారతశక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 175 | హైదరాబాద్ | గురువారం 01-01-2026 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

మస్క్ మాస్టర్ ప్లాన్..
ఏఐ కంప్యూటింగ్ కెపాసిటీ ఇక 2 గిగావాట్లు



11లో

## హైదరాబాద్ లో రాత్రి 10 నుంచి ఫ్లైఓవర్లు బంద్..

- 8 గంటల నుంచే డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు
- న్యూ ఇయర్ వేడుకలను ప్రశాంతంగా జరపడంపై పోలీసుల దృష్టి
- కఠినమైన ట్రాఫిక్ నిబంధనలను అమల్లోకి తెచ్చిన నగర పోలీసులు
- ఫ్లైట్ టికెట్ ఉంటేనే పీవీ ఎక్స్‌ప్రెస్ హైవే పైకి అనుమతి

## కిటకిటలాడుతున్న వనం..
## ముందస్తు మొక్కుల్లో మేడారం భక్తులు!



11లో

- వచ్చే నెల 28 నుంచి మహాజాతర ప్రారంభం
- ఇప్పటి నుంచే పోటెత్తుతున్న భక్తులు
- ఎత్తుబెల్లం, యాటలతో మొక్కులు తీర్చుకుంటున్న భక్తజనం
- రూ.251 కోట్లతో మేడారంలో అభివృద్ధి పనులు



11లో

## "ఏ ఫర్ ఆంధ్రా"...
## 'మనీకంట్రోల్' ఇదే చెబుతోంది

- మనీకంట్రోల్ 2025 టెక్ అండ్ స్టార్టప్ గైడ్ విడుదల
- ఏ-జెడ్ లిస్ట్‌లో 'ఏ' ఫర్ ఆంధ్రా అంటూ ఏపీకి ప్రత్యేక గుర్తింపు
- ఇండియాస్ న్యూ టెక్ డార్లింగ్ ఏపీనే అన్న మంత్రి నారా లోకేశ్
- రాష్ట్రంలో టెక్నాలజీ అభివృద్ధికి ఇది నిదర్శనమని ట్వీట్

ఒకే లాంచర్ నుంచి రెండు 'ప్రళయ్' క్షిపణులు...
## ప్రయోగం విజయవంతం

- భారత్ అమ్ములపొదిలో మరో అస్త్రం 'ప్రళయ్'
- వరుసగా రెండు మిస్సైల్స్ పరీక్ష విజయవంతం
- 150 నుంచి 500 కిలోమీటర్ల లక్ష్యాలను ఛేదించే సత్తా
- డీఆర్డీవో శాస్త్రవేత్తలను అభినందించిన రాజ్‌నాథ్ సింగ్
- త్వరలోనే సైన్యంలో



11లో

చేరనున్న ప్రళయ్ క్షిపణులు

2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన
## సీఎం రేవంత్ రెడ్డి

- తెలంగాణ రైజింగ్ విజన్ 2047 లక్ష్య సాధన దిశగా పయనిస్తున్నట్లు వెల్లడి
- అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడి
- ప్రతి కుటుంబం ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్ష



11లో



## భూగర్భ దోపిడి..
## అరికట్టేవాడేడి..?


ఈ భూమి తన గర్భంలో ఎంతో వెలకట్టలేని సంపదను దాచుకుంది.. ఆ సంపద సమాజానికి ఉపయోగపడాలని ఆ భూమాత ఆశిస్తోంది.. కానీ ఆ విలువైన సంపదను కొందరు ముష్కరులు అడ్డగోలుగా దోచుకుంటున్నారు.. ఇటు ప్రజలకు, అటు ప్రభుత్వానికి దక్కకుండా తమ బొక్కసాలు నింపుకుంటున్నారు.. ఇతడి దారుణమైన దోపిడీ జరుగుతున్నా.. మైనింగ్ మాఫియా విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నా, ప్రభుత్వ పెద్దలు గానీ, ఉన్నతాధికారులు గానీ పెదవి విప్పడంలేదు.. చర్యలు తీసుకోవడం లేదు.. ఎందుకంటే ఆ అక్రమ మైనింగ్ వ్యవహారంలో వీరందరికీ భాగస్వామ్యం ఉంది కాబట్టి.. ఇక తెలంగాణ రాష్ట్రంలో అక్రమ మైనింగ్ ఒక వ్యవస్థీకృత దోపిడీగా మారింది. ఇసుక, గ్రానైట్, క్వార్ట్జ్, బొగ్గు, మట్టి, రాయి.. ఇలా ఏ ఖనిజాన్ని తీసుకున్నా ఒకే కథ. అధికారుల నిర్లక్ష్యం, రాజకీయ అండదండలు, మైనింగ్ మాఫియాల బలంతో రాష్ట్ర వనరులు నిశ్శబ్దంగా కొల్లగొట్టబడుతున్నాయి. ఇది కేవలం పర్యావరణ నాశనం కాదు... ప్రభుత్వ ఖజానాపై, ప్రజల అస్థిత్వంపై జరుగుతున్న పగటి దోపిడీ.



12లో

కొత్త ఏడాది మీకందరికీ
## మంచి జరగాలి

- నూతన సంవత్సర శుభాకాంక్షలు అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్
- ఒక రోజు ముందుగానే పింఛను సొమ్ము అందిస్తున్నామన్న సీఎం చంద్రబాబు
- తమ ప్రభుత్వం ఇప్పటి వరకూ 50వేల కోట్లకు పైగా పింఛన్ల కోసం ఖర్చు చేసినట్లు వెల్లడి



11లో

భారత శక్తి

# రాజకీయ వ్యూహాలు.... కుటుంబ బంధాలు !

మహారాష్ట్ర రాజకీయాల్లో ఊహించని మలుపు చోటుచేసుకుంది. దాదాపు రెండు దశాబ్దాలుగా రాజకీయంగా దూరంగా ఉన్న అన్నదమ్ములు ఉద్ధవ్ థాకరే, రాజ్ థాకరే మళ్లీ ఒక్కటయ్యారు. ఈ కలయిక మహారాష్ట్ర రాజకీయాల్లోనే కాదు, దేశవ్యాప్తంగా కూడా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా 2026 ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో వీరిద్దరూ కలిసి పనిచేయాలని నిర్ణయించుకోవడం రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ముంబైలోని శివాజీ పార్క్ సమీపంలో ఉన్న శివసేన వ్యవస్థాపకుడు బాలాసాహెబ్ థాకరే స్మారక చిహ్నం వద్ద ఉద్ధవ్ థాకరే, రాజ్ థాకరే కుటుంబ సభ్యులతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇద్దరూ ఒకే కారులో రాజ్ థాకరే ఇంటి నుంచి రావడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఇది కేవలం ఒక కుటుంబ సమావేశం మాత్రమే కాకుండా, రాబోయే రాజకీయ మార్పులకు సంకేతంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. విభేదాలు, వ్యక్తిగత అపార్థాల కారణంగా విడిపోయిన ఈ కుటుంబం మళ్లీ కలవడం మరాఠీ ఓటర్లలో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ప్రత్యేకంగా ఏక్‌నాథ్ షిండే వర్గంతో తీవ్రంగా పోరాడుతున్న ఉద్ధవ్ థాకరేకు, తమ్ముడు రాజ్ థాకరే మద్దతు లభించడం ఒక పెద్ద ప్లస్ పాయింట్‌గా కనిపిస్తోంది. ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ఉద్ధవ్ థాకరే రాజకీయ భవిష్యత్తుకు అత్యంత కీలకంగా మారాయి. ఎందుకంటే ఈ ఎన్నికల్లో గెలుపు సాధిస్తేనే శివసేన అసలైన వారసుడు ఎవరు అన్న విషయం ప్రజల్లో స్పష్టతకు వస్తుంది. మరాఠీ మనుషుల హక్కుల కోసం, ముంబై ఆత్మగౌరవం కోసం తామంతా ఒక్కటయ్యామని ఈ ఇద్దరు నాయకులు ప్రకటించారు. కులమతాలకు అతీతంగా ముంబై ప్రజలందరినీ కలుపుకుని ముందుకు వెళ్తామని శివసేన నాయకులు పేర్కొన్నారు. విడిపోయి పోరాడితే అది ఇక్కడి అమరవీరులకు చేసే అవమానమని కూడా వారు స్పష్టం చేశారు. రాజ్ థాకరే తన ప్రసంగంలో ఐక్యతను బలంగా చాటారు. వ్యక్తిగత అపార్థాల కన్నా మహారాష్ట్ర గౌరవమే ముఖ్యమని అన్నారు. సీట్ల పంచకాలు కన్నా ముంబై ప్రయోజనాలే తమకు ప్రాధాన్యత అని, నాసిక్ వంటి ఇతర కార్పొరేషన్లలో కూడా ఈ పొత్తు కొనసాగుతుందని వెల్లడించారు. ఈ పొత్తు ద్వారా ముంబై పీఠాన్ని తప్పకుండా దక్కించుకుంటామని రాజ్ థాకరే ధీమా వ్యక్తం చేశారు. అయితే ఈ రాజకీయ పొత్తు ద్వారా నిజంగా లాభం ఎవరికీ? నష్టం ఎవరికీ? అనే ప్రశ్నలు ఇప్పుడు ప్రజల్లో వినిపిస్తున్నాయి. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఈ కలయిక వల్ల లాభం నేరుగా ముంబై ప్రజలకు చేరుతుందా? లేక ఈ ఇద్దరు సోదరులకు, వారిని నమ్ముకున్న నాయకులకు మాత్రమే పరిమితమవుతుందా? అన్న సందేహాలు ఉన్నాయి. మరోవైపు, ఈ పొత్తు వల్ల షిండే వర్గానికి, అలాగే మహారాష్ట్రలోని ఇతర రాజకీయ పార్టీలకు ఇది పెద్ద సవాల్‌గా మారనుంది. మరాఠీ ఓటు బ్యాంక్ మళ్లీ ఒకే చోట చేరితే, రాబోయే ఎన్నికల్లో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొత్తంగా చూస్తే, థాకరే బ్రదర్స్ కలయిక కేవలం ఒక కుటుంబ పునర్మిళనం మాత్రమే కాదు. ఇది మహారాష్ట్ర రాజకీయాల్లో ఒక కీలక మలుపు. దీని ఫలితం ముంబై మున్సిపల్ ఎన్నికలతో పాటు, రాష్ట్ర రాజకీయాల దిశను కూడా నిర్ణయించనుంది. ఈ పొత్తు ద్వారా ఎవరు గెలుస్తారు, ఎవరు నష్టపోతారు అన్నది కాలమే తేల్చాలి. కానీ ఇప్పటికైతే, ఈ కలయిక మహారాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా కొనసాగుతోంది. 2023లో ఎన్సీపీ చీలిక తర్వాత ఉప్పు-నిప్పులా విడిపోయిన బాబాయ్-అబ్బాయ్ (శరద్ పవార్, అజిత్ పవార్) మళ్లీ చేతులు కలిపారు. రాబోయే పింప్రి-చించ్వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల కోసం రెండు వర్గాలు కలిసి పోటీ చేస్తాయని ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ అధికారికంగా ప్రకటించారు. "రాష్ట్ర అభివృద్ధి కోసం కొన్ని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. గడియారం, ట్రంపెట్ గుర్తులు ఇప్పుడు ఏకమయ్యాయి. పవార్ కుటుంబం మళ్లీ ఒక్కటైంది" అని ఆయన పేర్కొనడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. పింప్రి-చించ్వాడ్ ప్రాంతం దశాబ్దాలుగా పవార్ కుటుంబానికి కంచుకోటగా ఉంది. 1999 నుంచి 2017 వరకు ఇక్కడ పవార్ల హవానే నడిచింది. అయితే 2017లో బీజేపీ ఈ కోటను కైవసం చేసుకుంది. అయితే ఇప్పుడు ఆ పాత వైభవాన్ని తిరిగి తెచ్చుకోవడమే లక్ష్యంగా ఇరు వర్గాలు పొత్తుకు సిద్ధం అయ్యాయి. కేవలం కుటుంబం కలవడమే కాకుండా.. ఓట్లు చీలిపోకుండా చూసి బీజేపీని దెబ్బకొట్టాలనేది వీరి మాస్టర్ ప్లాన్. సీట్ల సర్దుబాటుపై చర్చలు ఇప్పటికే ముగిశాయని.. త్వరలోనే తుది జాబితా విడుదల చేస్తామని అజిత్ పవార్ స్పష్టం చేశారు. ఈ పొత్తుపై మహాయుతి కూటమిలోని ఇతర భాగస్వామ్య పక్షాల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. బీజేపీ నేత నవనీత్ రాణా మాట్లాడుతూ.. "అజిత్ పవార్ ఎప్పుడూ శరద్ పవార్ మాట వింటారని మాకు తెలుసు. ఇప్పుడు వారు కలవడం సంతోషకరం. త్వరలోనే శరద్ పవార్ కూడా ఎన్డీయేలో చేరుతారని ఆశిస్తున్నాను'' అని వ్యాఖ్యానించారు. అయితే ఏక్‌నాథ్ షిండే శివసేన వర్గం మాత్రం దీనిని తీవ్రంగా విమర్శించింది. మహారాష్ట్ర ప్రజలు కేవలం 'ఇంటి పేరు' చూసి ఓట్లు వేయరని.. అభివృద్ధి చేసే వారికే పట్టం కడతారని షైనా ఎన్‌సి వంటి నేతలు ఎద్దేవా చేశారు. ముంబై, పుణెతో పాటు పింప్రి-చించ్వాడ్ సహా మొత్తం 29 మున్సిపల్ కార్పొరేషన్లకు 2026 జనవరి 15వ తేదీన పోలింగ్ జరగనుంది. మరుసటి రోజు అంటే జనవరి 16వ తేదీన ఓట్ల లెక్కింపు చేపడతారు. నామినేషన్ల దాఖలుకు డిసెంబర్ 30 చివరి తేదీ కావడంతో.. పవార్ల పొత్తు ప్రకటన అభ్యర్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. పుణె రీజియన్‌లో పట్టు సాధించేందుకు 'పవార్ పరివార్' వేసిన ఈ ఎత్తుగడ ఏ మేరకు ఫలిస్తుందో చూడాలి.

# కాపు దళిత నినాదంతో కొత్త పార్టీ

విజయవాడ, డిసెంబర్ 31(భారత శక్తి)

ఆంధ్రప్రదేశ్ రాజకీయ యవనికపై మరో కొత్త అధ్యాయం మొదలుకానుందా? గడిచిన ఎన్నికల్లో కూటమి ప్రభంజనం ముందు డీలాపడ్డ ప్రతిపక్షం.. ఇప్పుడు సరికొత్త వ్యూహానికి తెరలేపుతోందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. రాజకీయ వర్గాల్లో ప్రస్తుతం జోరుగా సాగుతున్న ప్రచారం ప్రకారం.. ఏపీలో కాపు, దళిత సామాజిక వర్గాల కలయికతో ఒక కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవించే దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. సస్పెండెడ్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ వ్యూహ రచన, దివంగత నేత వంగవీటి మోహన రంగా కుమార్తె వంగవీటి ఆశ భాగస్వామ్యంతో ఈ కొత్త శక్తి తెరపైకి రాబోతోందని విశ్వసనీయ సమాచారం. కొంతకాలం క్రితం సస్పెండెడ్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. "కాపులు, దళితులు ఏకతాటిపైకి వస్తేనే రాజ్యాధికారం సాధ్యం. కాపు సామాజిక వర్గానికి ముఖ్యమంత్రి పీఠం, దళితులకు ఉపముఖ్యమంత్రి పదవి దక్కాలి" అనేది ఆయన ప్రతిపాదన. ఒక మాజీ అధికారిగా కాకుండా, ఒక పొలిటికల్ స్ట్రాటజిస్ట్ లా ఆయన చేసిన ఈ వ్యాఖ్యల వెనుక వైసీపీ పెద్దల హస్తం ఉందనేది బలంగా వినిపిస్తున్న ఆరోపణ. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కీలక బాధ్యతలు నిర్వర్తించి, ఆ పార్టీకి అనుకూలంగా వ్యవహరించారనే ముద్ర పడిన సునీల్ కుమార్.. ఇప్పుడు తెరవెనుక ఉంటూ ఈ కొత్త రాజకీయ ప్రయోగానికి రూపకల్పన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కొత్త సమీకరణంలో ప్రధాన ఆకర్షణ వంగవీటి ఆశ. దివంగత వంగవీటి మోహన రంగాకు కాపు సామాజిక వర్గంలో ఉన్న ఆరాధన భావం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇటీవల విశాఖలో నిర్వహించిన 'రంగా సేన' ఆత్మీయ సమ్మేళనం ఈ కొత్త పార్టీ ఊహాగానాలకు ఊపిరి పోసింది. ఈ సభలో కాపులతో పాటు దళితులు, బీసీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రంగా ఆశయ సాధన కోసం కొత్త వేదిక అవసరం అని మెజారిటీ కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేయడం గమనార్హం. వంగవీటి రాధా రాజకీయంగా మౌనంగా ఉంటున్న తరుణంలో, రంగా వారసత్వాన్ని అందిపుచ్చుకుని, ఆయన ఇమేజ్ ద్వారా కాపు యువతను ఆకర్షించడానికి వంగవీటి ఆశను ముందు పెడుతున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. 2024 ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఘనవిజయం సాధించడానికి ప్రధాన కారణం కాపు ఓట్ల ఏకీకరణ. పవన్ కళ్యాణ్ చొరవతో కాపు ఓట్లు గంపగుత్తగా కూటమికి పడ్డాయి. ఇది వైసీపీని కోలుకోలేని దెబ్బ తీసింది. వచ్చే ఎన్నికల నాటికి ఈ ఓటు బ్యాంకును చీల్చకపోతే వైసీపీకి భవిష్యత్తు కష్టమే. అందుకే, నేరుగా వైసీపీలో చేరలేని కాపు, దళిత వర్గాలను ఆకర్షించడానికి ఒక మూడో ప్రత్యామ్నాయం లేదా కొత్త పార్టీ అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే.. రంగా సెంటిమెంట్ ను వాడుకుని కాపు ఓట్లను చీల్చడం, దానికి దళిత ఓట్లను జత చేయడం ద్వారా కూటమి ఓటు బ్యాంకుకు గండి కొట్టాలనేది మాస్టర్ ప్లాన్ గా కనిపిస్తోంది. పీవీ సునీల్ కుమార్, వంగవీటి ఆశలతో పాటు మరికొందరు వైసీపీ సానుభూతిపరులు, మేధావులు ఈ పార్టీలో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. అయితే, కేవలం సామాజిక సమీకరణాలతో పార్టీని నడపడం అంత సులభం కాదు. వంగవీటి ఆశకు క్షేత్రస్థాయిలో రాజకీయ అనుభవం తక్కువ. పవన్ కళ్యాణ్ లాంటి ఛరిష్మా ఉన్న నేత ముందు ఆమె ఎంతవరకు నిలబడగలరనేది ప్రశ్న. గతంలో కాపు, దళిత సామాజిక వర్గాలను ఏకం చేయడానికి జరిగిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. బీఎస్పీ-జనసేన పొత్తు ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. ఈ రెండు వర్గాల మధ్య క్షేత్రస్థాయిలో ఉన్న అంతరాలను చెరిపివేయడం కత్తి మీద సాము లాంటిది. అన్నిటికీ మించి ఈ కొత్త పార్టీ వెనుక జగన్ మోహన్ రెడ్డి ఉన్నారనే ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళితే, అది అంతిమంగా ఆ పార్టీ విశ్వసనీయతను దెబ్బతీస్తుంది. మొత్తానికి, ఏపీలో మరో కొత్త పార్టీ ఆవిర్భావానికి రంగం సిద్ధమవుతోందన్నది కాదనలేని సత్యం. వచ్చే ఎన్నికల నాటికి పూర్తిస్థాయిలో యాక్టివ్ అయ్యేలా గ్రౌండ్ వర్క్ జరుగుతోంది. ఇది కేవలం ఓట్ల చీలిక కోసమే పుడుతోందా? లేక నిజంగానే బడుగు, బలహీన వర్గాలకు ప్రత్యామ్నాయ వేదిక అవుతుందా? అనేది కాలమే నిర్ణయించాలి.

# వల్లభనేని వంశీ మోహన్ మిస్సింగ్

విజయవాడ, డిసెంబర్ 31(భారత శక్తి)

వల్లభనేని వంశీ మోహన్ మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. కొత్త కేసులు చుట్టుముట్టడంతో అనుచరులతో కలిసి అండర్ గ్రౌండ్ లోకి వెళ్లారు. అయితే ఆది నుంచి వల్లభనేని వంశీ విషయంలో ఒక దూకుడు కనిపించింది. వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో ఆయన టిడిపి ఎమ్మెల్యే. పార్టీ ఫిరాయించారు సరే. కానీ అదే పనిగా చంద్రబాబుతో పాటు లోకేష్ పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. దానికి ఇప్పుడు మూల్యం చెల్లించుకుంటున్నారు. వాస్తవానికి వల్లభనేని వంశీ మోహన్ పై కొత్తగా కేసులు నమోదు చేయలేదు కూటమి ప్రభుత్వం. తనకు తానుగా చేసిన తప్పిదాలకు ఇప్పుడు ఇబ్బంది పడుతున్నారు వంశి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత నిరసన వ్యక్తం చేస్తున్న టిడిపి శ్రేణులపై ఆయన దాడి చేయించారు. దీంతో ఆయనతో పాటు అనుచరులపై కేసు నమోదు అయింది. ఎక్కడ అరెస్టు చేస్తారేమోనని ఆయన పరారీ అయ్యారు. కోర్టుల నుంచి తన అరెస్టు విషయంలో సానుకూలత వచ్చేవరకు ఆయన పరారీ లోనే ఉంటారువల్లభనేని వంశీ మోహన్ జగన్మోహన్ రెడ్డికి రాజకీయంగా అండగా నిలిచారు. టిడిపిలో గెలిచి వైసీపీలో ఫిరాయించారు. అయితే నిత్యం అనుచిత వ్యాఖ్యలు చేస్తూ చంద్రబాబుతో పాటు లోకేష్ ను డామేజ్ చేయాలని చూశారు. కానీ అది వర్కౌట్ కాలేదు సరి కదా ఇప్పుడు ఇబ్బందుల్లో పడ్డారు వంశీ మోహన్. ఇప్పటికే జైలుకు వెళ్లి అనారోగ్యానికి గురయ్యారు. రాజకీయంగా కూడా అంత యాక్టివ్ కాలేకపోతున్నారు. మరోసారి అజ్ఞాతంలోకి అంటే ఎప్పటికైనా మళ్లీ అరెస్టు జరిగే అవకాశం ఉంది. అందుకే జగన్మోహన్ రెడ్డి గన్నవరం విషయంలో ఒక నిర్ణయానికి రాబోతున్నట్లు ప్రచారం సాగుతోంది. వంశీని సైడ్ చేసి కొత్త నేతను తెచ్చే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. వల్లభనేని వంశీ విషయంలో జరిగిన వ్యవహారం పై ఎవరూ నోరు మెదపడం లేదు. పైగా సానుభూతి చూపించడం లేదు. నిజంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు జగన్మోహన్ రెడ్డిని అభిమానించి.. సంప్రదాయ రాజకీయానికి అలవాటు పడిన ఏ ఒక్క నేత అప్పట్లో వల్లభనేని వంశీ వాడిన భాష, వ్యాఖ్యలను



ఇష్టపడలేదు. వైయస్సార్ పార్టీ ఓటమికి ఇటువంటి నేతలే కారణం అన్న అభిప్రాయం కూడా ఉంది. అయితే ఇప్పుడు వల్లభనేని వంశీ మోహన్ కోసం వెయిట్ చేసే ఉద్దేశం జగన్మోహన్ రెడ్డికి లేదు. అందుకే ప్రత్యామ్నాయ నేతను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. గన్నవరంలో ప్రత్యామ్నాయ నాయకులు చాలామంది ఉన్నారు. వారందరూ యాక్టివ్ అవుతున్నారు. ఇంకోవైపు కాంగ్రెస్ పార్టీకి చెందిన మహిళా నేత ఒకరు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. అప్పటికే బలమైన నాయకత్వం ఉండగా గన్నవరం టిక్కెట్ ఇచ్చారు చంద్రబాబు 2014లో వల్లభనేని వంశీ మోహన్ కు. 2019లో సైతం రెండోసారి టిక్కెట్ ఇచ్చారు. రెండుసార్లు టికెట్ ఇచ్చి గెలిపించుకున్న చంద్రబాబుపై అనుచితంగా మాట్లాడారు వల్లభనేని వంశీ మోహన్. కానీ ఇప్పుడు ఎవరికోసమైతే ఇదంతా చేశారో అదే జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు గన్నవరం నియోజకవర్గం గురించి సీరియస్గా ఆలోచిస్తున్నారు. తప్పకుండా గన్నవరం నియోజకవర్గానికి కొత్త ఇన్చార్జ్ రావడం ఖాయం అని ప్రచారం నడుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# తిరుపతిలో స్పోర్ట్స్ సిటీకి భూమి

తిరుపతి,డిసెంబర్ 31(భారత శక్తి)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. తిరుపతి జిల్లా దామినేడులో స్పోర్ట్స్ సిటీ నిర్మాణానికి భూములు కేటాయించింది. దామినేడులో నేషనల్ స్టాండర్డ్ స్పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు కోసం గతంలో 28.37 ఎకరాల భూమిని ఏపీ టూరిజం అథారిటీకి కేటాయించారు. అయితే ఆ ప్రాజెక్టు దిశగా అడుగులు పడకపోవటంతో.. తాజాగా జరిగిన ఏపీ మంత్రిమండలి సమావేశంలో ఈ భూమిని స్పోర్ట్స్ సిటీ నిర్మాణం కోసం శాప్‌కు ఇవ్వాలని నిర్ణయించారు ఈ ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం లభించటంతో దామినేడులో 28.37 ఎకరాల భూమిని ఉచితంగా శాప్‌కు బదిలీ చేయనున్నారు. మరోవైపు రాజధాని అమరావతిలో ఏపీ ప్రభుత్వం అంతర్జాతీయ స్పోర్ట్స్ సిటీ నిర్మాణానికి ప్రణాళికలు రచిస్తున్న సంగతి తెలిసిందే. దీనితో పాటుగా ప్రతి నియోజకవర్గంలోనూ క్రికెట్ గ్రౌండ్లు ఉండేలా ఏపీ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా క్రికెట్ మైదానాలు, స్పోర్ట్స్ సిటీల నిర్మాణం ఆలోచన చేస్తోంది. ఈ క్రమంలోనే శాప్ ఆధ్వర్యంలో తిరుపతిలో స్పోర్ట్స్ సిటీ నిర్మించాలని నిర్ణయించారు. ఈ స్పోర్ట్స్ సిటీ నిర్మాణం కోసం తిరుపతి రూరల్ మండలం దామినేడు ప్రాంతాన్ని ఎంపిక చేశారు. ఇక్కడ ఉన్న 28.37 ఎకరాలను టూరిజం అథారిటీ నుంచి శాప్‌కు ఉచితంగా బదిలీ చేస్తూ ఇటీవలే రెవెన్యూశాఖ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రతిపాదనలకు తాజాగా జరిగిన ఏపీ కేబినెట్ భేటీలో ఆమోదం లభించింది. మరోవైపు దామినేడులో ఎకరా భూమి విలువ సుమారుగా రెండున్నర కోట్ల వరకూ ఉన్నట్లు సమాచారం. దీంతో 28 ఎకరాల భూమిని ఉచితంగా కేటాయిస్తూ ఉండటంతో.. అధికారులు పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

# అనంతపురానికి మహర్దశ

అనంతపురం, డిసెంబర్ 31(భారత శక్తి)

పారిశ్రామిక అభివృద్ధిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రతి ఇంట్లో ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే నినాదంతో పెట్టుబడులను ఆకర్షిస్తోంది. ఈ నేపథ్యంలో ముఖ్యంగా ఉమ్మడి అనంతపురం జిల్లాకు భారీ పెట్టుబడులు వస్తున్నాయి. రేమండ్ గ్రూప్, స్కై ఫ్యాక్టరీ, గిన్‌ఫ్రా ప్రెసిషన్, సుగ్నా స్పాంజ్ పవర్ వంటి కంపెనీలు.. భారీ పెట్టుబడులుతో యూనిట్లను నెలకొల్పడానికి ముందుకు వచ్చాయి. కాగా, యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు నేతృత్వంలో అడుగులు వేస్తోంది. అందులో భాగంగాపెట్టుబడులు ఆకర్షించడానికి ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది ఏపీ ప్రభుత్వం. అయితే పరిశ్రమలను ఒకేచోట కేంద్రీకృతం చేయకుండా.. జిల్లాల్లో కూడా ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహిస్తోంది. అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. ముఖ్యంగా వెనుకబడిన రాయలసీమ జిల్లాలకు ప్రాధాన్యం ఇస్తోంది. అందులో భాగంగా అనంతపురం జిల్లాకు పరిశ్రమల రాకతోనే ఆర్థిక



ఏడాదిన్నర కాలంలోనే అనంతపురం జిల్లాలో రూ. 4,194 కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ పెట్టుబడుల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 3 వేల మందికి పైగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. వ్యవసాయంతో పాటు పారిశ్రామిక అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. పురోగతి సాధ్యమవుతుందని విశ్వసిస్తోంది. అందులో భాగంగా ఎంఎస్‌ఎంఈలను ఏర్పాటు చేసేందుకు ఔత్సాహికులను ప్రోత్సహిస్తోంది. జిల్లాకు క్యూ కట్టేలా.. రాయితీలు, ప్రోత్సాహకాలు, భూమి, నీరు కేటాయింపులు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు జిల్లాలో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తోంది. ఏడాదిన్నర కాలంలోనే దాదాపు రూ. 4,194 కోట్ల పెట్టుబడులు అనంతపురం జిల్లాకు వచ్చినట్లు ప్రభుత్వం చెబుతోంది. దీని ద్వారా ప్రత్యక్ష, పరోక్షంగా సుమారు 3 వేల మందికి పైగా ఉద్యోగాలు రానున్నట్లు చెప్పింది. ఇటీవల విశాఖలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో అనంతపురం జిల్లాకు పలు రకాల పెట్టుబడులు రాగా.. ఇప్పటికే సీఎం చంద్రబాబు కొన్నింటికి శంకుస్థాపన కూడా చేశారు. ప్రభుత్వం చెప్పిన వివరాల ప్రకారం.. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో.. రేమండ్ గ్రూప్ మూడు యూనిట్లను నెలకొల్పనుంది. ఈ మేరకు ఆ సంస్థ రూ. 1200 కోట్ల పెట్టబడులు పెట్టనుంది. ఇందులో రాప్తాడు దగ్గర అప్పారెల్ పార్కు కోసం రూ. 497 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి వద్ద ఆటో కాంపొనెంట్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్లాంటు నెలకొల్పడానికి రూ. 441 కోట్లు, టేకులోడు వద్ద ఏరోస్పేస్ పరికరాల తయారీ యూనిట్ కోసం రూ. 262 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. ఈ మూడు యూనిట్లతో.. 6,500 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నట్లు తెలిపింది. స్కై ఫ్యాక్టరీ అనే సంస్థ కళ్యాణదుర్గంలోని తిమ్మసముద్రం వద్ద ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందు రూ. 1,300 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. వెయ్యి ట్యాక్సీల తయారీ లక్ష్యంగా ఈ యూనిట్ 2027 నాటికి ఉత్పత్తి ప్రారంభించనుంది. ఈ పరిశ్రమ ద్వారా 180 మందికి పైగా ఉద్యోగాలు లభించనున్నాయి. దీనికి సమీపంలోనే గిన్‌ఫ్రా ప్రెసిషన్ ప్రైవేటు లిమిటెడ్ అనే కంపెనీ.. బై మాడ్యూలర్ ఛార్జ్ సిస్టమ్స్ తయారు చేసేందుకు యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు రూ. 1,150 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. ఈ సంస్థ 121 ఎకరాల్లో తయారీ యూనిట్ నెలకొల్పేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. తాడిపత్రి మండలం బోగసముద్రం వద్ద కార్యకలాపాలు నిర్వహిస్తున్న సుగ్నా స్పాంజ్ పవర్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ.. మరో యూనిట్ నెలకొల్పేందుకు రూ. 1,247 కోట్ల పెట్టుబడులకు ప్రభుత్వం నుంచి అనుమతులు పొందింది. ఈ కొత్త తయారీ

# మూడేళ్ల ముందు నుంచే హడావిడి..

కాకినాడ,డిసెంబర్ 31(భారత శక్తి)

సాధారణంగా ఎన్నికలు దగ్గరపడుతుండడంతో సీట్లు దక్కించుకునేందుకు నేతలు పోటీ పడుతుంటారు.. దానికోసం ప్రచార అస్త్రాలతోపాటు ప్రజలతో మమేకమవ్వడం, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం.. అధినేతలను, ముఖ్యనేతలను కలుసుకుని తన గుర్తింపును పదిలపరచుకోవడం వంటివి చూస్తుంటాం.. కానీ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో ప్రతిపక్షపార్టీ వైఎస్సార్ సీపీ లో పరిస్థితి దీనికి భిన్నంగా మారింది.. సాధారణ ఎన్నికలకు ఇంకా మూడేళ్ల కాలం ఉన్నా వైసీపీ నాయకులు వైసీపీ అసెంబ్లీ సీటు కోసం నానా హైరానా పడుతున్నారు.. బరిలో వేమున్నామంటే మేమున్నామంటూ నియోజకవర్గ సమన్వయకర్తతో సంబంధం లేకుండా ఎవరికివారు తమ ఉనికిని చాటుకునేందుకు కాపాడుకునేందుకు వీర ప్రయత్నాలు చేస్తున్నారు.. 2012 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘోర పరాజయం తరువాత చాలా నియోజకవర్గాల్లో వైసీపీ నేతలు సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారు.. ఇదే తీరు అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం నియోజకవర్గంలోకూడా కనిపించింది.. అయితే వైసీపీ నియోజకవర్గ ఇంచార్జ్ మార్పు తరువాత అనూహ్యమైన మార్పు కనిపిస్తోంది.. అమలాపురం నియోజకవర్గంలో తిరుగులేని పాత్ర పోషించిన మాజీ మంత్రి విశ్వరూప్ నియోజకవర్గానికి దూరమవ్వడం.. ఆయన కుమారుడు శ్రీకాంత్ నాయకత్వాన్ని అంగీకరించని కొందరు పార్టీ నేతలు పక్కచూపులు చూడడం.. మొత్తం మీద నియోజకవర్గంలో వైసీపీ ఐక్యతా రాగం బీటలువారి రిజర్వుడు కేటగిరిలో ఉన్న కొందరు నాయకులు తమ ఉనికిని చాటుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు ప్రస్ఫుష్టంగా కనిపిస్తున్నాయి.. ఇటీవల ఉప్పలగుప్తంలో జరిగిన జగన్ జన్మదిన వేడుకలో ప్రొటోకాల్ పాటించలేదంటూ ఎమ్మెల్సీ ఇజ్రాయేల్ అసహనం వ్యక్తం చేస్తూ ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయముందని, అధిష్టానం ఎవరికి సీటు ఇచ్చినా వారి గెలుపుకోసం పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.. అంటే అమలాపురం వైసీపీలో సీటు కోసం హీటు పెరిగిందా అన్న సెటైర్లు వినిపిస్తున్నాయి.. అమలాపురం పార్లమెంటు స్థానం నుంచి తొలిసారిగా ఎంపీగా పోటీచేసి విజయం సాధించిన మాజీ ఎంపీ చింతా అనురాధ ఇటీవల కాలంలో తన స్పీడు పెంచారు.. మొన్నటి ఎన్నికల్లో సీటు దక్కకపోవడంతో నియోజకవర్గానికి చాలా కాలం దూరమయ్యారు.. అయితే ఎన్నికల సమయంలో మాత్రం అడపా దడపా ప్రచారంలో పాల్గొన్న అనురాధ మొత్తం మీద సీఈసీ సభ్యురాలిగా పదవిని తెచ్చుకోగలిగారు. దీంతో అప్పటి నుంచి స్పీడు పెంచిన అనురాధ నియోజకవర్గంలో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు.. ఓ పక్క పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూనే ప్రత్యేకంగా తన వర్గంతో పరామర్శల నుంచి పలుకరింపుల వరకు ఒక్క రోజులో అనేక చోట్ల చుట్టేస్తున్నారు.. అంతటితో ఆగక సోషల్ మీడియా వేదికగా ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఎంపీ అనురాధ వెంట నడుస్తున్నవారిలో ఎక్కవ మంది గతంలో మాజీ మంత్రి విశ్వరూప్ అనుచర వర్గమే ఉండడం కనిపిస్తోంది.. ఉప్పలగుప్తంలో జరిగిన జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలో మాజీ మంత్రి విశ్వరూప్, నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీకాంత్, ఎమ్మెల్సీలు ఫోటోలు లేకుండానే ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం అక్కడి వారు చింతా అనురాధా నాయకత్వాన్ని బలపరుస్తున్నట్టు చెప్పకనే చెప్పినట్లయ్యింది.. గుడ్ సీడ్ ఫౌండేషన్ ద్వారా విస్తృతంగా సేవాకార్యక్రమాలు నిర్వహించే వైసీపీ సీనియర్ నాయకుడు కుంచే రమణారావు ఇటీవల కాలంలో పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డిని తరచూ కలవడం, ఇటీవల జరిగిన జగన్ జన్మదిన వేడుక సందర్భంగా భారీ స్థాయిలో హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడం ఎప్పటిలానే కనిపించినా ఈ ఏడాది అయితే మరింత జోరు పెంచినట్లు కనిపిస్తోంది.. అయితే గత కొన్ని నెలలుగా ఒకప్పుడు మాజీ మంత్రి విశ్వరూప్ అత్యంత సన్నిహితులుగా మెలిగిన వారిలో కొంత మంది రమణారావు వెంట కనిపిస్తున్నారు.. జగన్ అజెండాతో కొంత మంది పార్టీ యువత చేస్తున్న కార్యక్రమాలను ప్రోత్సహించడం, నియోజకవర్గంలో సుడిగాలి పర్యటనలు చేయడంతోపాటు ఆ వీడియోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ తన ఉనికిని చాటుకునేందుకు మరింత స్పీడు పెంచినట్లు కనిపిస్తోంది.. ఇదిలా ఉంటే మాజీ ఎంపీ అనురాధ, రమణారావు పలు కార్యక్రమాలకు కలిసి పాల్గొనడం ఆ కార్యక్రమాల్లో నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీకాంత్ కానీ, ఇతర ముఖ్యనేతలు కనిపించకపోవడంపై చర్చ సాగుతోంది..నియోజకవర్గంలో మాజీ మంత్రి విశ్వరూప్ అనుచర వర్గంలో చాలా మంది పక్కచూపులు చూడడం ఇంతకాలం అసంతృప్తితోనే ఆయన వెంట నడిచారా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.. ఓటమి తరువాత అందులోనూ నియోజకవర్గ కోఆర్డినేటర్ బాద్యతల మార్పు తరువాత వర్గీయులకు వంక దొరికిందా అన్న చర్చ జరుగుతోంది.. ఇటీవల ప్రకటించిన పార్టీ పదవుల్లో ఆశపడి భంగపడ్డ వారు, అధికారంలో ఉన్నప్పుడు తమకేమీ ఉపయోగపడలేదన్న అసంతృప్తితోనే దూరమవుతున్నట్లు కొందరు చెబుతున్నట్లు తెలుస్తోంది.. అయితే ముఖ్య అనుచరగణంలో కొందరు మాత్రం విశ్వరూప్ వెంటే ఉండగా విశ్వరూప్ స్థానికంగా పెద్దగా ఉండకపోవడంతో వారు ఇటీవలకాలంలో సైలెంట్ అవుతున్నారు.. ఇక తప్పక నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీకాంత్ పిలుస్తున్నప్పుడు వెళ్లి హాజరవుతున్నట్లు తెలుస్తోంది.. రాబోయే ఎన్నికల పండుగ కోసం ఎదురు చూస్తున్న కొందరు వైసీపీ నాయకులు ముందే కూసిన కోయిల చందంగా ప్రచారార్భాటాలతో దూసుకుపోతుండగా మీరు కోనసీమకు మళ్లీ రావాలంటూ ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబుకు కొందరు వైసీపీ నాయకులు స్వాగతం పలుకుతున్నారని తెలుస్తోంది.. సోషల్ మీడియా వేదికగా కూటమి నేతలపై విరుచుకుపడుతున్న బొజ్జా ఐశ్వర్యకు వైసీపీ బెర్త్ ఖాయం అంటూ మరికొందరు జోష్యం చెప్పడం నియోజకవర్గంలో కనిపిస్తోంది.. ఎన్నికలకు చాలా సమయం ఉన్నా మొత్తం మీద అమలాపురం వైసీపీలో మాత్రం సీట్ కోసం హీట్ కనిపిస్తోంది..

# ఆన్‌లైన్‌లో అభ్యంతరకరమైన కంటెంట్‌పై కొరడా


న్యూఢిల్లీ, డిసెంబర్ 31(భారత శక్తి)

ఆన్‌లైన్, సోషల్ మీడియా వేదికలకు కేంద్రం మరోసారి తీవ్ర హెచ్చరికలు చేసింది. తమ వేధికల్లోని అశ్లీల, అసభ్యకరమైన కంటెంట్‌పై సరైన చర్యలు తీసుకోకపోతే చట్టపరమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని వాటికి వార్నింగ్ ఇచ్చింది. ఈ మేరకు డిసెంబరు 29న ఐటీ శాఖ సర్క్యులర్ జారీ చేసింది. ఇందులో ఐటీ నిబంధనలు 2021 ప్రకారం, చట్టవిరుద్ధమైన కంటెంట్‌ను తొలగించాలని, ఫిర్యాదు అందిన 24 గంటల్లోగా చర్య తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది.ఆన్‌లైన్, సోషల్ మీడియా వేదికలకు కేంద్ర ప్రభుత్వం గట్టి హెచ్చరిక జారీ చేసింది. తమ వేదికలపై అశ్లీల, అసభ్యకరమైన కంటెంట్‌పై సరైన చర్యలు తీసుకోకపోతే చట్టపరమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేసింది. డిసెంబర్ 29న కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ మంత్రిత్వ శాఖ జారీచేసిన ఉత్తర్వులో ఆన్‌లైన్, సోషల్ మీడియా వేదికలు తమ అంతర్గత నిబంధనలను వెంటనే సమీక్షించుకోవాలని, చట్టవిరుద్ధమైన, అశ్లీల కంటెంట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఇక, సుప్రీంకోర్టు కూడా ఆన్‌లైన్, సోషల్ మీడియా వేదికల్లో ప్రసారమయ్యే కంటెంట్‌ను పోర్నోగ్రఫీతో పోల్చింది.ఈ ఆదేశాలను పాటించడంలో విఫలమైతే చట్టపరమైన చర్యలు తప్పవని మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. ఆన్‌లైన్ వేదికలకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం సెక్షన్ 79 కింద లభించే బాధ్యత మినహాయింపు, తమ ప్లాట్‌ఫామ్‌లలోని మూడో పక్షం కంటెంట్‌పై 'తగిన జాగ్రత్త' తీసుకున్నప్పుడే వర్తిస్తుందని పేర్కొంది. ఇటీవలి సమీక్షల్లో అనేక సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు అశ్లీల, అసభ్యకరమైన, ఇతర చట్టవిరుద్ధమైన కంటెంట్‌పై చర్యలు తీసుకోవడం లేదనే అభిప్రాయం వ్యక్తమైంది. ఐటీ నిబంధనలు 2021 ప్రకారం.. అశ్లీల, పిల్లల లైంగిక వేధింపులకు సంబంధించిన లేదా పిల్లలకు హానికరమైన కంటెంట్‌ను అందుబాటులో ఉంచడం, అప్‌లోడ్ చేయడం, ప్రచురించడం, ప్రసారం చేయడం, పంచుకోవడం వంటివి నిరోధించడానికి సహేతుకమైన ప్రయత్నాలు చేయాలని ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లకు మంత్రిత్వ శాఖ గుర్తు చేసింది.కోర్టు ఆదేశాలు లేదా ప్రభుత్వ నోటిఫికేషన్ అందిన వెంటనే చట్టవిరుద్ధమైన కంటెంట్‌ను తొలగించాలని లేదా దానికి యాక్సెస్‌ను నిలిపివేయాలని స్పష్టం చేసింది. లైంగిక చర్యలలో ఒక వ్యక్తిని చిత్రీకరించే కంటెంట్‌పై ఫిర్యాదు అందిన 24 గంటల్లోగా చర్య తీసుకోవడం తప్పనిసరి. అన్ని ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు తమ కంటెంట్ మోడరేషన్ సిస్టమ్‌లను, అంతర్గత నియంత్రణ ప్రక్రియలను, వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాలను వెంటనే సమీక్షించుకోవాలని ఐటీ మంత్రిత్వ శాఖ కోరింది. ఇదిలా ఉండగా, ఆన్‌లైన్, సోషల్ మీడియాలో అశ్లీలత శృతిమించడంతో సామాజిక ఉద్యమకారులు, హక్కుల సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. గతంలో సుప్రీంకోర్టు సైతం అనేక సందర్భాల్లో ఈ అంశంపై ఆందోళన వ్యక్తం చేసింది. వీటిని నియంత్రణకు మార్గదర్శకాలను రూపొదించాలని కేంద్రాన్ని ఆదేశించింది.

# ఢిల్లీకి కవచం.. సుదర్శన చక్రం

న్యూఢిల్లీ,డిసెంబర్ 31(భారత శక్తి)

దేశ రాజధాని ఢిల్లీలో భద్రతకు సంబంధించి కేంద్రంలోని మోదీ సర్కారు కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇందుకోసం మొత్తం రూ.5,181 కోట్లతో స్వదేశీ సమీకృత గగనతల రక్షణ ఆయుధ వ్యవస్థ ను కొనుగోలు చేయడానికి



అనుమతించినట్టు సమాచారం. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఈ మేరకు జాతీయ మీడియా కథనం వెల్లడించింది. 'సుదర్శన చక్ర' ఫ్రేమ్‌వర్క్‌లో భాగంగా పైలట్ ప్రాజెక్ట్ కింద ఢిల్లీలోని ముఖ్యమైన వీఐపీ-89 జోన్‌లో ఈ వ్యవస్థను ఏర్పాటుచేయనున్నారు

డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ అభివృద్ధి చేసిన ఈ వ్యవస్థ దేశ రాజధాని చుట్టూ 30 కి.మీ. పరిధిలోని గగనతలంలో ఎటువంటి ముప్పునైనా నిరోధించగలదని సదరు వర్గాలు తెలిపాయి. అత్యంత సున్నితమైన ప్రాంతాల్లో డ్రోన్ల వంటి ఆయుధాల ముప్పు పెరుగుతున్న నేపథ్యంలో మోదీ సర్కారు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. సైనిక సామర్థ్యాలను మరింత బలోపేతం చేసేలా రూ.79 వేల కోట్ల విలువైన ఆయుధాలను కొనుగోలుచేయడానికి రక్షణ శాఖ సోమవారం ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే ఈ గగనతల రక్షణ వ్యవస్థ కొనుగోలు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారంప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ ఏడాది ఆగస్టు 15 ప్రసంగంలో గగనతల రక్షణ వ్యవస్థ గురించి ప్రకటించారు. 'సుదర్శన్ చక్ర' పేరుతో కీలక ప్రాంతాలను వైమానిక దాడుల నుంచి రక్షించేలా బహుళ అంచెల కవచం, ప్రతిదాడి వ్యవస్థలను మోహరించనున్నట్లు తెలిపారు. దేశంలోని వ్యూహాత్మక, పౌర, జాతీయ ప్రాధాన్యత కలిగిన ప్రాంతాల భద్రతే దీని లక్ష్యం. ఇందులో భాగంగా శత్రువులు ప్రయోగించే క్షిపణులు, యుద్ధ విమానాలను ముందుగానే గుర్తించి, కూల్చివేసే వ్యవస్థలను అభివృద్ధి చేయనున్నారు. అలాగే, సైబర్ దాడులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని కూడా ఈ వ్యవస్థలో అనుసంధానిస్తారు.డీఆర్డీవో, సైన్యం, ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో దీన్ని ఏర్పాటు చేయడానికి కేంద్రం ఇప్పటికే సన్నాహకాలు ప్రారంభించింది. ఢిల్లీలో పైలట్ ప్రాజెక్ట్‌గా చేపడుతున్నట్టు అధికారులు తెలిపారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత గగనతల భద్రతను పటిష్టం చేయాలని భారత్ నిర్ణయించింది. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం మెరుపు దాడులకు దాయాది రగిలిపోయింది. సరిహద్దుల్లోని భారత సైనిక, వైమానిక స్థావరాలపై దాడులకు ప్రయత్నించగా.. వాటిని సైన్యం సమర్థవంతంగా అడ్డుకుంది. ఎస్-400 వంటి గగనతల రక్షణ వ్యవస్థలను భారత్ వినియోగించింది. అంతేకాదు, పాక్‌పై ఎదురుదాడి చేసి, దాని మౌలిక వసతులు, సైనిక స్థావరాలపై విరుచుకుపడింది. పాక్ నూర్ ఖాన్ ఎయిర్ బేస్ సహా కీలకమైన వ్యవస్థలను ధ్వంసం చేసింది

# పెరగనున్న రైళ్ల సంఖ్య..

విజయవాడ, డిసెంబర్ 31(భారత శక్తి)

రైళ్ల రద్దీని తగ్గించేందుకు కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. రానున్న ఐదేళ్లలో దేశంలోని 48 ప్రధాన రైల్వే స్టేషన్ల నుంచి రైళ్ల సంఖ్యను రెట్టింపు చేయాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా



విశాఖపట్నం రైల్వే స్టేషన్ నుంచి నడిచే రైళ్ల సంఖ్య రెట్టింపు కానుంది. ప్రస్తుతం 37 రైళ్లు నడుస్తుండగా, ఈ సంఖ్య 74కు చేరుకుంటుంది. రూ.500 కోట్లతో స్టేషన్ అభివృద్ధి, ప్లాట్‌ఫారాల విస్తరణతో పాటు, కొత్త కోచింగ్ డిపో ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి.రాబోయే ఐదేళ్లలో విశాఖపట్నం నుంచి నడిచే రైళ్ల సంఖ్య రెట్టింపు అవుతుందని, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని కేంద్ర రైల్వే శాఖ ప్రకటించింది. ఇదిలా ఉంటే ఇప్పటికే రూ. 500 కోట్లతో విశాఖ రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేసే ప్రణాళికలు సిద్ధమయ్యాయి. విశాఖ రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫారాల సంఖ్యను 8 నుంచి 14కు పెంచుతామని ఎంపీ శ్రీభరత్ తెలిపారు. రాబోయే ఐదేళ్లలో విశాఖపట్నం డివిజన్‌లో మరిన్ని అభివృద్ధి పనులు జరుగుతాయని రైల్వే వర్గాలు వెల్లడించాయి.ప్రస్తుతం విశాఖపట్నం రైల్వే స్టేషన్ నుంచి రోజుకు 37 రైళ్లు నడుస్తున్నాయి. కేంద్రం నిర్ణయం ప్రకారం, రాబోయే ఐదేళ్లలో ఈ సంఖ్య 74కు చేరుకుంటుంది. అంటే, విశాఖ నుంచి డిమాండ్ అధికంగా ఉండే సికింద్రాబాద్, బెంగళూరు, చెన్నై, తిరుపతి, ఢిల్లీ, ముంబై, అహ్మదాబాద్, కోల్‌కతా, రాయ్‌పూర్ వంటి నగరాలతో పాటు, అరకులోయ వంటి పర్యాటక ప్రాంతాలకు కొత్త రైళ్లు అందుబాటులోకి వస్తాయి. వీటితో పాటు విశాఖ నుంచే కాశీ వంటి పుణ్యక్షేత్రాలకు కూడా రైళ్లు నడిచే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే తిరుపతి, బెంగళూరులకు వందేభారత్ రైళ్లు నడపాలనే ప్రతిపాదనలు కూడా కార్యరూపం దాల్చుతాయి.విశాఖపట్నం రైల్వే స్టేషన్ రద్దీగా మారింది. ఇక్కడ లైన్ల సంఖ్య పరిమితంగా ఉండటంతో, కొన్ని రైళ్లు దువ్వాడ దాటిన తర్వాత స్టేషన్ బయటే ఆగిపోతున్నాయి. మరికొన్ని రైళ్లను ఒకటి, 2 రోజుల తర్వాత షెడ్యూల్ చేయాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో వాటిని నిలిపి ఉంచడానికి సరైన చోటు లేక, నగర శివారు మార్గాల్లో ఖాళీగా ఉన్న లైన్లలో వాటిని నిలిపి ఉంచుతున్నారు. దీనివల్ల రైళ్ల నిర్వహణ కష్టమవుతోంది.అయితే ఈ సమస్యలకు పరిష్కారంగా.. జగన్నాథపురాన్ని శాటిలైట్ స్టేషన్‌గా అభివృద్ధి చేయాలని అధికారులు ప్రతిపాదించారు. అక్కడ పెద్ద కోచింగ్ మెయింటెనెన్స్ డిపోతో పాటు, భారీ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయాలని ఆలోచనలో ఉన్నారు. ఇందుకోసం ఇప్పటికే రూ. 2,800 కోట్లతో ప్రతిపాదనలు రైల్వే బోర్డుకు పంపించారు.ఇదిలా ఉంటే.. విశాఖపట్నంలో రైల్వే యార్డును ఆధునీకరించడానికి డీపీఆర్ సిద్ధమైంది. ఇందులో 5 కొత్త లైన్లు, 10 స్టేబిలింగ్ లైన్లు, అదనపు ప్యాసింజర్ ప్లాట్‌ఫారాలు, ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వంటి సౌకర్యాలు కల్పించాలని బోర్డుకు ప్రతిపాదించారు. వీటితో పాటుగా ఫ్లైఓర్లు, బైపాస్‌లు, ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్‌లను కూడా నిర్మించాలని ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు రైల్వే వర్గాలు తెలిపాయి. ఇవన్నీ పూర్తయితే ఈ ప్రాంతంలో పెద్ద సంఖ్యలోఉద్యోగ అవకాశాలు కూడా లభిస్తాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# తిరుమల తరహాలో చెంచులకు శ్రీశైలంలో ప్రాధాన్యం

కర్నూలుడిసెంబర్ 31(భారత శక్తి)

శ్రీశైలం దేవస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. శ్రీశైలంలో చెంచులకు ఉచితంగా మల్లికార్జునస్వామి స్పర్శ దర్శనం కల్పిస్తున్నారు. చెంచులకు ఉచిత స్పర్శ దర్శనాన్ని శ్రీశైలం దేవస్థానం బోర్డు ఛైర్మన్ రమేష్ నాయుడు, శ్రీశైలం దేవస్థానం ఈవో శ్రీనివాసరావు ప్రారంభించారు. ప్రతి మంగళవారం రోజున




500 మంది చెంచులు శ్రీశైలం మల్లన్న స్పర్శ దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రతి నెలా ఒకరోజు చెంచులకు ఉచితంగా స్పర్శ దర్శనం కల్పించనున్నట్లు వివరించారుతిరుమల.. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఆధ్యాత్మిక క్షేత్రం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులకు పవిత్ర పుణ్య క్షేత్రం. జీవితంలో ఒక్కసారైనా తిరుమల కోనేటి రాయుడి దర్శనం చేసుకోవాలని ప్రతి మనసూ తపిస్తూ ఉంటుంది. అలాగే తిరుమల శ్రీవారి వైభవాన్ని, తిరుమల ఆధ్యాత్మిక వాతావరణాన్ని కళ్లారా చూడాలని ప్రతి వ్యక్తి కోరుకుంటాడు. ఈ నేపథ్యంలోనే శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తిరుమల తిరుపతి దేవస్థానం చర్యలు చేపడుతూ వస్తోంది. దేవుడి దర్శనం మొదలుకొని వసతి వరకూ ప్రతి విషయంలోనూ అత్యంత జాగ్రత్తతో వ్యవహరిస్తూ వస్తోంది. అలాగే స్థానికులకు తిరుమల శ్రీవారిని మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో తిరుపతి వాసులకు.. శ్రీవారి దర్శనం ఉచితంగా కల్పిస్తోంది.ప్రతి నెలలో ఓ రోజు స్థానికులకు శ్రీవారి దర్శన భాగ్యం కల్పిస్తోంది. ప్రతి నెలా మెదటి మంగళవారం స్థానికులకు శ్రీవారి దర్శనం అవకాశాన్ని టీటీడీ కల్పిస్తోంది. అయితే తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలోనే శ్రీశైలం దేవస్థానం కూడా కీలక నిర్ణయం తీసుకుంది. శ్రీశైలంలో చెంచులకు ఉచితంగా స్పర్శ దర్శనం కల్పిస్తోంది. ప్రతి నెలలో ఒకరోజుచెంచులకు ఉచితంగా శ్రీశైలం మల్లన్న స్పర్శ దర్శనం కల్పిస్తున్నారు. చెంచులకుఉచిత స్పర్శ దర్శనాన్ని శ్రీశైలం దేవస్థానం బోర్డు ఛైర్మన్ రమేష్‌నాయుడు, ఈవో శ్రీనివాసరావు ప్రారంభించారు. మంగళవారం రోజున సుమారుగా 500 మంది చెంచు గిరిజనులు శ్రీశైలంలో స్పర్శ దర్శనం చేసుకున్నారు.శ్రీశైలం దేవస్థానం పాలకమండలి నిర్ణయం మేరకు ప్రతి నెలా ఒకరోజు చెంచులకు ఉచితంగా స్పర్శ దర్శనం కల్పిస్తామని ఆలయ అధికారులు చెప్తున్నారు. స్వామిని గిరిజనులకు మరింత చేరువ చేయాలనే మంచి ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రతి నెలలో ఓ రోజు చెంచులలో కొంతమందిని ఎంపిక చేసి.. వారికి స్పర్శ దర్శనం కల్పించనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం ఐటీడీఏ సహకారం తీసుకుంటామని.. ఐటీడీఏ సహకారంతో ఉచిత స్పర్శ దర్శనానికి చెంచు గిరిజనులను ఎంపిక చేస్తామన్నారు. దర్శనంతో పాటుగా వారి రాకపోకలకు, వసతి ఏర్పాట్లు కూడా చేయనున్నట్లు వివరించారు.

# మాయం అవుతున్న గుట్టలు

హైదరాబాద్,డిసెంబర్ 31(భారత శక్తి)

రాత్రి పడితే చాలు మొరం మాఫియా రాత్రికి రాత్రి గుట్టలను



గుటుక్కుమని మాయం చేస్తున్నారు. గ్రామ శివారులు పట్టణ శివారు లతోపాటు చెరువులు గుట్టలను తవ్వేస్తూ మొరం దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతున్నది. సెలవు దినాలతో పాటు రాత్రి వేళల్లోనూ ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇష్టరాజ్యంగా మొరం తరలిస్తూ లక్షలాది రూపాయలను అర్జిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.కామారెడ్డి జిల్లా బాన్సువాడ డివిజన్ పరిధిలోని జుక్కల్ మద్నూర్ బిచ్కుంద పిట్లం పెద్ద కోడాప్గల్ నిజాంసాగర్ బీర్కూర్ నస్రుల్లాబాద్ నాగిరెడ్డిపేట్ ఎల్లారెడ్డి బాన్సువాడ, బీర్కూర్ కోటగిరి వర్ని చందూర్ పోతంగల్ రుద్రూర్ మోస్రా మండలాల్లో మొరం, మట్టి అక్రమ తరలింపు జోరుగా సాగుతుంది.అనుమతులు లేకుండా భారీగా మొరం తరలిస్తూ అక్రమార్కులు ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు.ఒకటి టిప్పర్ వంటి వాహనాలకు మొరం కు ప్రభుత్వం నుంచి ఒక టన్నుకు రాయల్టీ డిఎంఎఫ్, ఎస్ఎంటి, ఇతర పన్నులు అన్ని కలిపి ఒక టన్నుకు రూ.56 రూపాయల వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఒక టిప్పర్ కు సుమారు రూ. 900 రాయల్టీ చెల్లించాలి. కానీ ఇవేవీ లేకుండానే మొరనీ తరలింపు చేస్తున్నారు. రోజుకు వందల సంఖ్యలో టిప్పర్ల ద్వారా మొరం ఒక్కో టిప్పర్ ధర రూ 4000 నుండి 4500 వరకు విక్రయిస్తున్నారు.రోజువారీగా సగటున బాన్సువాడ మండలం నుండే లక్షల్లో వాల్టా రూపంలో ప్రభుత్వానికి ఆదాయం రావాల్సి ఉండగా ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన రాయల్టీ సొమ్ము, అక్రమార్కుల జేబుల్లోకి వెళ్తుండడంతో గుట్టలు స్వాహా చేస్తున్న మాఫియా పై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందిరమ్మ లబ్ధిదారులకు మొరం కావాలంటే సవా లక్ష నియమ నిబంధనలు పెట్టే అధికారులు. అక్రమ రవాణా చేసే వ్యాపారులకు ఎలాంటి నిబంధనలు వర్తించవు. సెలవు వచ్చిందంటే చాలు ఏ అనుమతులు ఉండవు. సర్కారుకు వాల్టా రాయల్టీ చెల్లించరు.అయినా రాత్రి, పగలు అనే తేడా లేకుండా మొరం కొల్లగొడుతారు. ప్రభుత్వానికి ఎలాంటి వాల్టా రాయల్టీ చెల్లించకుండా అధికారులకు మచ్చిక చేసుకొని అక్రమ రవాణా చేస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్ల పేరిట మోరం దందా సాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. బాన్సువాడ మండలం కొల్లూరు శివార్లలో, సోమేశ్వర్, దేశాయిపేట్, బుడిమి, జక్కల దాని తాండ కెనాల్ శివార్లలో గ్రామ శివారులోని గుట్టల్లో ఎలాంటి అనుమతులు లేకుండా మొరం తవ్వకాలు కొనసాగుతున్నాయి.టిప్పర్లలో నిత్యం వందల ట్రిప్పుల మొరాన్ని సోమేశ్వర్ శివారు ప్రైవేట్ వెంచర్, బాన్సువాడ లోని ప్రైవేటు వెంచర్లకు, ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. అక్రమ రవాణా రెవెన్యూ, పోలీస్ అధికారులకు తెలిసినప్పటికీ తెరవెనుక ఈ అక్రమ దందా అధికారులు సంపూర్ణంగా వ్యాపారులకు సహకరిస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో ఈ అక్రమ దందాకు అధికారులు అండగా ఉండడంతో మూడు పువ్వులు ఆరుకాయలుగా విరజిల్లింది.దీంతో ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు ఈ అక్రమ దందా కు వత్తాసు పలకడంతో వ్యాపారులకు ఈ అక్రమ దందా ద్వారా కాసులు వర్షం కురిపించేందుకే అధికారులు పరోక్షంగా సహకరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ జీతం తీసుకుంటూ ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చాల్సిన అధికారులే ప్రభుత్వ గండి కొడుతున్న మాఫియాకు వత్తాసు పలుకుతూ చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు.అధికారులకు ఏదైనా సమాచారం తెలుసుకు నేందుకు ఫోన్ చేస్తే మండల అధికారులు, జీపిఓలు ఫోన్ లిఫ్ట్ చేయకపోవడం బట్టి చూస్తే అధికారుల నిర్లక్ష్యం ఎలా ఉన్నదో ఇట్టే అర్థమవుతుంది. ప్రభుత్వ ఆదాయానికి గండికోడుతూ మొరం తరలించే వారికి అండగా ఉన్న మండల ఆయా శాఖల అధికారుల పై జిల్లా ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు ఇంత జరుగుతున్న రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తు న్నారని ఆరోపణలు ఉన్నాయి.అక్రమార్కులు రాత్రిపూట తవ్వకాలు జరిపి గుట్టలను, చెరువులను మాయం చేస్తున్నారు. మైనింగ్ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకపోయినా అధికార పార్టీకి చెందిన నాయకుల పేరు చెప్పి తవ్వకాలు చేపడుతున్నారు. మొరం మాఫియా ఆగడాలు మితిమీరడంతో వనరులు, వృక్ష సంపద కనుమరుగవుతున్నది.అనుమతులు లేకుండా సాగుతున్న మొరం వ్యాపారంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతున్నది. మొరం వ్యాపారం చేయాలంటే మైనింగ్ శాఖ నుంచి అనుమతులు తీసుకొని రెవెన్యూ, పోలీసులకు సమాచారం ఇవ్వాలనే నిబంధన ఉన్నది. కానీ బాన్సువాడ డివిజన్లో నిబంధనలను తుంగలో తొక్కి దర్జాగా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి అక్రమ మొరం,మట్టి రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ క్షేత్రస్థాయిలో రెవెన్యూ, పోలీస్, మైనింగ్ శాఖ అధికారులు మామూలు తీసుకొని అక్రమార్కులకు అండదండలు అందిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అభివృద్ధి పనుల పేరిట అధికారులకు తెలుపుతూ ప్రైవేటు వ్యక్తులు చేపడుతున్న ఇండ్ల నిర్మాణాలు, వెంచర్లు ఇతరత్రా నిర్మాణాలకు రాత్రి సమయాల్లో మట్టి, మొరం విక్రయాలతో వ్యాపారం సాగిస్తున్నారు. మట్టి, మొరం అక్రమ తవ్వకాలను నియంత్రించాలని స్థానికులు పేర్కొంటున్నారు. సెలవు దినాల్లో,రాత్రి వేళలో జరుగుతున్న అక్రమ మురం తవ్వకాలు రవాణాకు రెవిన్యూ పోలీస్ శాఖలో కొంతమంది అధికారులు కుమ్మక్కు అయినట్లు పలు ఆరోపణలు ఉన్నాయి. అర్ధరాత్రి నుండి తెల్లవారుజాము వరకు పోలీస్ శాఖ పనిలో ఎదుట నుండే అక్రమ మొరం రవాణా సాగుతున్న పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు సైతం పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు ఉన్నాయి.ఇంత అక్రమ రవాణా జరుగుతున్న అటు రెవెన్యూ ఇటు పోలీస్ శాఖ నియంత్రించడంలో పూర్తిగా విఫలమైందని పలువురు పేర్కొంటున్నారు. అంతేకాకుండా కొంతమంది అధికారుల ప్రమేయం ఉండడంతోనే రాత్రి వేళలో అక్రమ రవాణా సాగుతుందని పలు విమర్శలు కూడా తావు ఇస్తుంది ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక బృందంతో తనిఖీలు చేపట్టి అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ.



జయశంకర్ భూపాలపల్లి (జిల్లా భారత శక్తి ప్రతినిధి) డిసెంబర్ 31: భూపాలపల్లి జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఒక ప్రకటన విడుదల చేశారు. నూతన సంవత్సరం జిల్లా ప్రజలందరికీ ఆరోగ్యం, సుఖసంతోషాలు, శాంతి, సమృద్ధిని తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల అమలులో ప్రజల సహకారం కొనసాగాలని, జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు నడిపేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు.

ప్రజలందరూ ఐక్యతతో ముందుకు సాగుతూ జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోరారు.

## ఇసుక మిస్‌యూజ్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 31 : భూపాలపల్లి జిల్లా ఐడిఓసి కార్యాలయంలో ఎంపిడిఓలతో ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక రవాణా అంశంపై ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ, ఇసుకను దుర్వినియోగం చేసినట్లయితే సంబంధితులపై క్రిమినల్ కేసులు పెట్టాలని కూపన్లలో అక్రమ సవరణలు చేసినా, అక్రమ రవాణా జరిగినా ఎంపిడిఓలు కఠినంగా వ్యవహరించాల్సిందేనని ఆదేశించారు.

ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా ఇసుక సరఫరా జరగాలని సూచించారు. ఎక్కడైనా అక్రమాలు జరిగితే వెంటనే చర్యలు తీసుకుని నివేదికలు సమర్పించాలని తెలిపారు.



ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ పిడి లోకిలాల్, ఎంపిడిఓలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి

జయశంకర్ భూపాలపల్లి (జిల్లా ప్రతినిధి భారత శక్తి) డిసెంబర్ 31 :భూపాలపల్లి జిల్లా కోర్టు సిబ్బందికి, న్యాయవాదులకు మరియు జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి. హెచ్. రమేష్ బాబు, అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ మరియు కోర్టు సిబ్బంది సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగవంతుని ఆశీస్సులతో కొత్త సంవత్సరంలో అందరూ బాగుండాలని అకాక్షించారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఏ. నాగరాజ్ , ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆర్. దిలీప్ కుమార్ నాయక్ , అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి జి. అఖిల , అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వి. శ్రీనివాస చారి, ఉపాధ్యక్షులు బల్లా మహేందర్, ప్రధాన కార్యదర్శి వి. శ్రావణ్ రావు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్



పుప్పాల శ్రీనివాస్, అడిషనల్ పి.పి. ఎం.డి.రఫీక్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ఇందారపు శివకుమార్, మంగళంపల్లి రాజ్ కుమార్, రత్నం కిరణ్, ప్రియాంక, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలకు 2026 నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు:జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప, డిసెంబర్ 31(భారత శక్తి): "కోటి ఆశలతో కొత్త సంవత్సరంలో అడుగిడుతున్న జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ నూతన ఆంగ్ల సంవత్సరం ప్రతి ఒక్కరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సౌభాగ్యాలు అందాలని, ప్రభుత్వ సుపరిపాలనలో ప్రజలకు సంతృప్తి స్థాయిలో సంక్షేమ పథకాల ఫలాలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు అభివృద్ధి కాంక్షతో, లక్ష్య నిర్దేశంతో, అందరి భాగస్వామ్యంతో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు.



## అత్యధిక మండలాలు కలిగిన జిల్లాగా వైయస్సార్ కడప జిల్లా -విలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

వైయస్సార్ కడప,డిసెంబర్ 31(భారత శక్తి): జిల్లాలో రాజంపేట నియోజకవర్గం కలవడంతో అత్యధిక మండలాలు కలిగిన జిల్లాగా వైయస్సార్ కడప జిల్లా నిలిచిందని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.బుధవారం స్థానిక కలెక్టరేట్లోని పి జి ఆర్ ఎస్ హాల్లో జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, రాజంపేట సబ్ కలెక్టర్ భావన, రాజంపేట ఏఎస్పీ మనోహర్ కుమార్ హెగ్డే లతో కలిసి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జిల్లాల పునర్విభజనలో భాగంగా అన్నమయ్య జిల్లాలోని రాజంపేట నియోజకవర్గం లోని 4 మండలాలు రాజంపేట, నందలూరు, వీరబల్లె, సుండుపల్లె జిల్లాలో విలీనమైనట్లు తెలిపారు. ప్రస్తుతం 40 మండలాల తో రాష్ట్రంలోనే అత్యధిక మండలాలు గల జిల్లాగా నిలిచిందని అన్నారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసిందని తెలిపారు. దీంతో రాజంపేట రెవెన్యూ డివిజన్ వైయస్సార్ జిల్లా పరిధిలో పనిచేస్తుందన్నారు.ఒంటిమిట్ట సిద్ధవటం మండలాలు కడప జిల్లాలోని రాజంపేట నియోజకవర్గం లో భాగంగా ఉంటాయన్నారు.రాజంపేట నియోజకవర్గంలోని 4 మండలాలు కలవడంతో ప్రస్తుతం కడప జిల్లా జనాభా 22 96,497 కు చేరిందన్నారు. అలాగే నందలూరులోని సౌమ్యనాథ ఆలయం, తెలుగు వాగ్గేయకారుడు అన్నమాచార్యుల గ్రామం తాళ్లపాక కడప జిల్లాకు రావడం జరిగిందన్నారు ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. రాజంపేట నియోజకవర్గంలోని మండలాలలోని ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వైఎస్ఆర్ జిల్లాలో కలపడం జరిగిందన్నారు. రాజంపేట నియోజకవర్గం లోని 4 మండలాలకు కడప జిల్లాతో విద్యా ఆర్థిక సాంస్కృతిక సంబంధాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ఈ నాలుగు మండలాలలో విద్యాసంస్థలు,ప్రభుత్వ, ఇతర సంస్థలు అన్ని కడప జిల్లాలో పరిధిలో పనిచేస్తాయని తెలిపారు. కడప జిల్లా దేశవ్యాప్తంగా హార్టీ కల్చర్ హబ్ గా అభివృద్ధి చెందుతోందని ఇందుకు రాజంపేటలోని 4 మండలాల్లో పండించే బనానా, చీని, నిమ్మ, మామిడి, బొప్పాయి వంటి పంటలు తోడు కావడంతో కడప జిల్లాకు హార్టికల్చర్ హబ్ గా మారడానికి మరింత ఊతమిస్తుందన్నారు. అలాగే రాజంపేట రెవెన్యూ డివిజన్లో ప్రతిరోజు యధావిధిగా ప్రభుత్వ సేవలు, సుపరిపాలన అందించాలని అధికారులకు సూచించారు. 100 సంవత్సరాల చరిత్ర కలిగిన రాజంపేట రెవెన్యూ డివిజన్ కు మౌలిక వసతుల్లో ఎలాంటి ఇబ్బందులు లేవని ఇంకా ఏవైనా కావాల్సి ఉంటే సమకూరుస్తామన్నారు.వైయస్సార్ కడప జిల్లాకు 2025 సంవత్సరం అత్యంత ప్రతిష్టాత్మకమైన సంవత్సరం గా అభివర్ణించారు. దేశవ్యాప్తంగా నీతి అయోగ విడుదల చేసే యాస్పిరేషనల్ డిస్ట్రిక్స్ విభాగంలో అన్ని పారామీటర్లలో ప్రథమ స్థానాన్ని సంపాదించి దేశంలోనే ప్రథమ ర్యాంకును సాధించినందుకు గర్వంగా ఉందని జిల్లా కలెక్టర్ సంతోషం వ్యక్తం చేశారు. జాతీయస్థాయిలో అత్యున్నత గుర్తింపు రావడం జిల్లాలో అన్ని శాఖల పరంగా శాఖల అధికారులు చేపట్టిన విజయంగా చెప్పవచ్చన్నారు. ఈ విజయానికి సహకరించిన జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు ప్రతి ఒక్కరికీ కూడా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు. అంతేకాకుండా జిల్లాలో నిర్వహిస్తున్న ప్రజా పరిషత్ సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) విధానాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నామని ప్రజల నుండి అందిన ఫిర్యాదులను అత్యంత త్వరితగతన పరిష్కరించేందుకు అన్ని శాఖల విభాగాధిపతులు క్షేత్రస్థాయి వరకు క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే సమస్యలను పరిష్కరించడం అభినందనీయమన్నారు. రెవెన్యూ వ్యవస్థలో ఉన్నటువంటి సమస్యలను మరింత సమర్థవంతంగా పరిష్కరించే దిశగా "రెవెన్యూ క్లినిక్" అనే విధానాన్ని కొత్త సంవత్సరం లో వచ్చే సోమవారం నుంచి అన్ని రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో, అన్ని మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల పరిధిలో అమలు చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమాన్ని కూడా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం జరుగుతుందన్నారు.

జిల్లాలో అమలు చేస్తున్న స్మార్ట్ కిచెన్ ప్రోగ్రాం దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు జిల్లాలో ప్రతిరోజు 10వేల మందికి పైగా మధ్యాహ్నం భోజన పథకం కింద పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. అలాగే జిల్లావ్యాప్తంగా మరో 33 స్మార్ట్ కిచెన్ ల పనులు వివిధ దశల్లో పురోగతిలో వున్నాయని జనవరి 26 నుంచి అమల్లోకి వస్తే 1.29 లక్షల మందికి విద్యార్థులకు ప్రతిరోజు రుచికరమైన పౌష్టికాహారం అందించే విధంగా లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు ఇందుకు సహకరించిన పత్రికా విలేకరులు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.అలాగే రాజంపేటలోని 4 మండలాలకు కూడా స్మార్ట్ కిచెన్ ప్రోగ్రాం పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు.

## అభివృద్ధి పనులపై మున్సిపల్ అధికారులతో సమావేశం --- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ,




ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 31: భూపాలపల్లి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధిలోని పెండింగ్ లో ఉన్న పనులు పూర్తయిన పనుల శంకుస్థాపనల పై మున్సిపల్ అధికారులతో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ భూపాలపల్లి మున్సిపాల్టీ కి ప్రభుత్వం 50 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగిందని కొన్ని చోట్ల పనులు పూర్తి చేయడం జరిగిందని పూర్తి చేసిన పనులకు శంకుశాపనలకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు.పెండింగ్ లో ఉన్న పనులను త్వరిత గతిన పూర్తి చేసే విధంగా కాంట్రాక్టర్ల కు ఆదేశాలు ఇవ్వాలని అన్నారు. కొంత మంది కాంట్రాక్టర్లు పనులు మొదలు పెట్టి సంవత్సరాలు గడుస్తున్న పూర్తి చేయడం లేదని అలాంటి కాంట్రాక్టర్ల కు 60 ఇ కింద నోటీసులు జారీ చేసి కాంట్రాక్ట్ రద్దు చేయాలని తెలిపారు. మున్సిపాల్టీ పరిధిలోని ప్రమాదకరంగా ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించి మున్సిపాల్టీ ఆదాయం వచ్చే విధంగా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ ఆసుపత్రి పై ప్రత్యేక చర్యలు తీసుకొని ఆసుపత్రి ఆవారా ఇఇ వేయాలని ,డ్రైనేజీ వ్యవస్థ ను మెరుగు పరచాలని అధికారులను ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పని చేసి మున్సిపాల్టీ అభివృద్ధి కి చర్యలు చేపట్టాలని ప్రతి పనికి ఒక టైం లైన్ ను నిర్దేశించి ఒక అధికారిణి నియమించాలని నిర్దేశిత సమయంలో పనులు పూర్తి చేయని కాంట్రాక్ ల పై చర్యలు తిసుకుంటమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# న్యాయ విజ్ఞాన సదస్సు



కడప, డిసెంబర్ 31(భారత శక్తి):ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశానుసారంగా, డాక్టర్ సి.యామిని, అధ్యక్షులు మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప మరియు సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప ఎస్.బాబా ఫక్రుద్దీన్ సూచనల మేరకు పానెల్ న్యాయవాదులచే కడప నగరం ఇండస్ట్రియల్ ఎస్టేట్ నందు "నల్సా (ఆశ-అవగాహన, మద్దతు, సహాయం మరియు చర్య) ప్రామాణిక ఆపరేటింగ్ విధానం ? బాల్య వివాహాలను నిర్మూలించడానికి, 2025, నల్సా పథకములు మొదలగు అంశాలపై న్యాయ విజ్ఞాన సదస్సు మరియు చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 ప్రచార కార్యక్రమాలు" నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి, బాల్య వివాహాల నుండి రక్షించబడిన వారికి మానసిక, సామాజిక మద్దతు అందించడం, నల్సా అనేది బలహీన వర్గాల వారికి ఉచిత న్యాయ సేవలు అందించే సంస్థ. ఆశ ప్రోగ్రామ్ ద్వారా బాల్య వివాహాల నిర్మూలనలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. ఈ నల్సా యూనిట్ జిల్లా స్థాయిలో పనిచేస్తూ, చైల్డ్ మ్యారేజ్ ప్రోహిబిషన్ ఆఫీసర్, అంగన్‌వాడీ కార్యకర్తలు, పోలీసులతో కలిసి పనిచేసి, బాలికల హక్కులను కాపాడుతుంది. ముఖ్య ఉద్దేశ్యాలు:అవగాహన: బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి ప్రజలకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించడం. మద్దతు: బాల్య వివాహాల నుండి రక్షించబడిన వారికి మానసిక, సామాజిక మద్దతు అందించడం.సహాయం: బాధితులకు ఉచిత చట్టపరమైన సలహా, కోర్టులో ప్రాతినిధ్యం, పునరావాసం (విద్య, వృత్తి శిక్షణ) కల్పించడం. చర్య: ఫిర్యాదులు స్వీకరించడం, చట్టపరమైన చర్యలు తీసుకోవడం, అధికారులతో సమన్వయం చేయడం, లోక్ అదాలత్‌ల ద్వారా పరిష్కారం చూపడం. ఆశ యొక్క యూనిట్ నిర్మాణం:జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ నేతృత్వంలో ఈ యూనిట్ ఏర్పాటు చేయబడుతుంది. ఇందులో జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి, ఫ్యామిలీ కోర్టు జడ్జి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి సభ్యులుగా ఉంటారు. నల్సా పాత్ర:నల్సా అనేది బలహీన వర్గాల వారికి ఉచిత న్యాయ సేవలు అందించే సంస్థ. ఆశ ప్రోగ్రామ్ ద్వారా బాల్య వివాహాల నిర్మూలనలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. సంక్షిప్తంగా: ఆశ అనేది బాల్య వివాహాల నివారణకు నల్సా ప్రారంభించిన ఒక సమగ్ర కార్యక్రమం, ఇది చట్టపరమైన, సామాజిక, మానసిక సహాయాన్ని అందిస్తూ, బాధితులకు అండగా నిలుస్తుంది. చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 మొదలగంశాలను వివరించారు. ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడప వారిని సంప్రదించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ప్రవీణ్ కుమార్, ప్యానల్ న్యాయవాది విక్రమ్, పారా లీగల్ వాలంటరీలు జేఎల్ శ్రీనివాసరావు, నిర్మల, ఈశ్వరయ్య, ఎన్జీవో లు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# గండికోట చారిత్రక, పర్యాటక వైభవాన్ని విశ్వవ్యాప్తం చేయాలి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

వై ఎస్ ఆర్ కడప,డిసెంబర్ 31(భారత శక్తి) : గండికోట చారిత్రక, పర్యాటక సాంస్కృతిక వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసేలా "గండికోట ఉత్సవాల" ను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను ఘనంగా చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గండి కోట ఉత్సవాల ఏర్పాట్లు, పనులపై జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. జిల్లా పర్యాటక శాఖ, ఏపిటిడిసి అధికారులతో



సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా గండికోట పర్యాటక ఉత్సవాల ఏర్పాట్లలో భగంగా చేపట్టే అన్ని రకాల పనులకు సంబంధించిన నిర్వహణ పనులను, మ్యాపులను, డిజైన్లను పరిశీలించి పలు సూచనలు, సలహాలను అందించారు. పనుల నాణ్యతతో ఎలాంటి రాజీ లేకుండా.. అన్ని రకాల పర్యటన ప్రాజెక్టులను చేపట్టాలని ఆదేశించారు.

అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రాల్లో క్యాపిటల్ ఇన్వెస్ట్మెంట్ కోసం ప్రత్యేక సహకారం (ఎస్ఏఎస్‌సీఐ) అందించే పథకం ద్వారా.. గండికోట పర్యాటక కేంద్రం లో సుసంపన్నమైన కోట మరియు గార్జ్ అనుభవాన్ని పర్యాటకుల సొంతం చేసే దిశగా.. జిల్లా యంత్రాంగం పర్యాటక శాఖ ద్వారా అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందన్నారు. 2026 జనవరి 11, 12, 13 తేదీల్లో జరగనున్న గండికోట పర్యాటక ఉత్సవాలను జిల్లా పర్యాటక, చారిత్ర, సాంస్కృతిక వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసేలా,దేశం నలు దిక్కులా చాటేలా.. కొన్ని ప్రధానమైన పనులను త్వరితగతిన పూర్తి చేయడం జరుగుతోందన్నారు. ఉత్సవాలకు మునుపే పూర్తి కావాల్సిన పలు ముఖ్యమైన పనులను పరిశీలించి.. ఎంట్రన్స్, వెలివేషన్, పార్కింగ్, అమినిటీ భవనం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎపిటిడిసి ఇంజనీర్లు, ప్రాజెక్ట్ కన్సల్టెంట్ లను ఆదేశించారు. పర్యాటకులు బస చేసేలా షెల్టర్లు, విఐపి లాంజ్, తాత్కాలిక టాయిలెట్లు, స్టాల్స్, రోడ్లు,వాటర్ సప్లే, విద్యుత్ మొదలైన సదుపాయాలతో పాటు.. పర్యాటకులను ఆకట్టుకునేలా లైట్ షో లు, విద్యుత్ దీపాలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలు, సెలెబ్రిటీల ఆహ్వానం, అలాగే అడ్వెంచర్ స్పోర్ట్స్, సాంస్కృతిక క్రీడలు మొదలైన అన్ని రకాల ఆకర్షణీయమైన కార్య క్రమాలను పక్కాగా చేపట్టాలన్నారు. ప్రత్యేకించి టూరిస్టులను ఆకర్షించేలా గండికోట వద్ద వ్యూపాయింట్ తో పాటు, చారిత్రక వైభవాన్ని ప్రతిబింబించేలా నిర్మాణాలు చేపట్టాలన్నారు. పర్యాటకులకు సంతృప్తికరమైన అనుభూతి ని అందించేలా కార్యక్రమాలను తీర్చిదిద్దాలని సంబందిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి ముందస్తు మీడియా ప్రచారం,సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంతకుముందు విసి ద్వారా పర్యాటక ఈవెంట్ మేనేజ్మెంట్ ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ ద్వారా సమీక్షించారు. కార్యక్రమంలో జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, ఏపీ టిడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుబ్రహ్మణ్యం, డీఈ పెంచలయ్య, పిఆర్ ఎస్ఈ మద్దన్న, జిల్లా టూరిజం అధికారి సురేష్ కుమార్, ఆర్ అండ్ బి ఎస్ఈ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పి4 ద్వారా ఉచిత వైద్యశిభిరం

వైఎస్సార్ కడప జిల్లా, డిసెంబర్ 31(భారత శక్తి) : కడప రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ ఆదేశాల మేరకు, పి4 కార్యక్రమంలో భాగంగా పైడికాల్వ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ వైద్య శిబిరాన్ని ఫాతిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ కాలేజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడంలో మొహమ్మద్ ఆరిఫ్ (ఎన్ ఆర్ ఐ) ప్రత్యేక చొరవ తీసుకుని గ్రామ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ముందుకు వచ్చారు. ఫాతిమా మెడికల్ కాలేజ్‌కు చెందిన అనుభవజ్ఞులైన వైద్యులు, నర్సింగ్ సిబ్బంది మరియు వాలంటీర్లు శిబిరంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పైడికాల్వ గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



ఈ వైద్య శిబిరంలో గ్రామ ప్రజలకు సాధారణ ఆరోగ్య పరీక్షలు రక్తపోటు, షుగర్ పరీక్షలు నిర్వహించి వైద్యుల సూచనలు మేరకు ఉచిత మందుల పంపిణీ చేయడం జరిగింది. పైడికాల్వ గ్రామానికి చెందిన పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ వైద్య శిబిరం ద్వారా లబ్ధి పొందారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఈ విధమైన వైద్య సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని గ్రామస్థులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

# విద్యార్థుల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

## నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వాహనాలను సీజ్ చేసిన జిల్లా రవాణా అధికారి

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) డిసెంబర్ 31: జిల్లాలో ఆటో రిక్షాలు, ఇతర వాహనాల ద్వారా ప్రయాణించే విద్యార్థుల భద్రతను ప్రధానంగా దృష్టిలో ఉంచుకొని, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా రవాణా అధికారి ఆదేశాల మేరకు ఆటో రిక్షాలు, మినీ క్యాబ్‌లపై విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించారు.



ఈ తనిఖీల సందర్భంగా కామారెడ్డి జిల్లాలోని బాన్సువాడ, పిట్లం, తాడ్వాయి, కామారెడ్డి ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వాహనాలను గుర్తించి, సహాయక మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు వాటిని సీజ్ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా రవాణా అధికారి మాట్లాడుతూ, విద్యార్థుల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపే సమయంలో వారు సురక్షితమైన వాహనాలలో ప్రయాణిస్తున్నారా అనే విషయాన్ని తప్పనిసరిగా పరిశీలించాలని, అలాగే రహదారి భద్రతా నియమాలు పాటించేలా రవాణా శాఖకు పూర్తి సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# నిజమైన జర్నలిస్టులకు అన్యాయం జరగదు

# మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

## మంత్రిని కలిసిన తెలంగాణ జర్నలిస్టు సంఘాల జేఏసీ



కరీంనగర్, డిసెంబర్ 31(భారతశక్తి ప్రతినిధి)

తెలంగాణలో గతంలో ఇచ్చిన మీడియా అక్రెడిటేషన్ కార్డుల కంటే అధికంగానే ఇస్తామని, నిజమైన జర్నలిస్టులకు తమ ప్రభుత్వ హయాంలో ఎలాంటి అన్యాయం జరగనివ్వబోమని రాష్ట్ర సమాచార,పౌరసంబధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అక్రిడిటేషన్ల జీవో 252 విషయంలో జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఏదైనా పొరపాట్లు ఉంటే త్వరలోనే జర్నలిస్టు సంఘాలతో సమావేశమై సవరిస్తామని అన్నారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ జర్నలిస్టు సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ(టీజేఏ జేఏసీ) నాయకులు మంత్రి పొంగులేటిని కలిసి జీవో 252 సవరణతో పాటు జర్నలిస్టుల ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... అతి త్వరలో అన్ని జర్నలిస్టు సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరుపుతుందని,అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని మరో జీవో తెస్తామని అన్నారు. డెస్క్ లో పనిచేసే వారికి, ఫీల్డ్ లో పనిచేసే జర్నలిస్టులకు అనేక సంక్షేమ పథకాలను అంచెలంచెలుగా అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సమాచార పౌరసంబధాల శాఖ స్పెషల్ కమిషనర్ సీహెచ్ ప్రియాంక లకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో 252 మార్గదర్శకాలలోని అభ్యంతరాలను నోటిఫికేషన్‌కు ముందు సవరించాలని, చిన్న పత్రికలు, కేబుల్ ఛానెళ్లతో పాటు ఎంపానల్మెంట్ కాకుండా ఉన్న ఇతర పత్రికలకు సంబంధించిన ప్రతి జర్నలిస్టుకు వారి సీనియారిటీని పరిగణనలోకి తీసుకొని అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని వారు కోరారు. రెండు కార్డుల వ్యవస్థకు బదులుగా, డెస్క్ జర్నలిస్టులకు కూడా జర్నలిస్టుల మాదిరిగానే ఒకే అక్రిడిటేషన్ కార్డు వ్యవస్థను కొనసాగించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు అయిందని, తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టులకు 15 సంవత్సరాల సీనియారిటీ నిబంధన అసంబద్ధమని, ఈ నిబంధన తొలగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించిన వారందరికీ ఎటువంటి షరతులు లేకుండా అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని, జర్నలిస్టుల కుటుంబాలకు ఉచిత విద్య, ఉచిత వైద్యం అందించాలని, ఇందుకు కోసం వెంటనే ఆయా విభాగాలకు అధికారిక ఆదేశాలు జారీ చేయాలని కోరారు. జర్నలిస్టుల కుటుంబ సభ్యులకు బీమా సౌకర్యం కల్పించాలని,60 సంవత్సరాలు నిండిన జర్నలిస్టులందరికీ నెలకు రూ. పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని, జర్నలిస్టులకు దేశవ్యాప్తంగా రైల్వే ఫ్రీ పాసులు కల్పించాలని,అదేవిధంగా జర్నలిస్టుల వాహనాలకు టోల్ గేట్ ఫీజు నుంచి మినహాయింపు సదుపాయం కల్పించాలని వారు మంత్రిని కోరారు. మంత్రిని, కమిషనర్ ను కలిసిన వారిలో జేఏసీ కన్వీనర్లు మామిడి సోమయ్య(టీడబ్ల్యూజేఎఫ్),కే.కోటేశ్వర్ రావు(ఏడబ్ల్యూజేఏ), అనంచిన్ని వెంకటేశ్వరరావు(టీజే ఎస్ఎస్), పులిపలుపుల ఆనందం(ఐఎఫ్ డబ్ల్యూజే), రావికంటి శ్రీనివాస్(డబ్ల్యూజేఐ), గౌటి రామకృష్ణ, రాణా ప్రతాప్, కీర్తి సంతోష్ రాజు తదితరులున్నారు.

# యూరియా నిల్వలను తనిఖీ చేసిన డిఏఓ సురేష్ కుమార్



మంగపేట/ములుగు జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 31 (భారత శక్తి): ములుగు జిల్లా మంగపేటమండలంలోని యూరియా నిల్వవలను తనిఖీ చేసి ఎరువుల సరఫరా పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకున్నామని జిల్లా వ్యవసాయ అధికారి సురేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు ఎటునాగారం ఏడీఏ అవినాష్ వర్మ తో కలిసి మంగపేట మండలంలోని వివిధ ఎరువుల డీలర్ అవుట్‌లెట్లను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా డీలర్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న యూరియా నిల్వలను ఫైవ్స్ యాప్ ద్వారా ధృవీకరించారు. స్టాక్ రిజిస్టర్లు, విక్రయ వివరాలు, బిల్లింగ్ ప్రక్రియలను పరిశీలించి, ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలను కచ్చితంగా పాటించాలని డీలర్లకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన మేరకు యూరియా సరఫరా నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. ఎరువుల అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయాలు జరిగితే టోల్ ఫ్రీ నంబర్ 18004257109 కు కాల్ చేసి సమాచారం అందిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో 814 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉన్నదని... ఇంకనూ 2354 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయుటకు సిద్ధంగా ఉన్నామని రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని సురేష్ కుమార్ తెలిపారు.

# మహిళా విద్య చైతన్య దీప్తి" సావిత్రి బాయి పూలే

## (జనవరి 3న సావిత్రి బాయి పూలే 195వ జయంతి సందర్భంగా)

సాంఘిక 'సామాజిక'రాజకీయ రంగాల్లో నూతన ఉత్తేజానికి అభ్యుదయ రకరమైనఆలోచనలకు విద్య ఆయుధం లాంటిది. మహిళా విధ్యావ్యాప్తితో మహిళా హక్కుల రక్షణ ఉద్యమ ప్రథాతగా సావిత్రి బాయి పూలే చరిత్రలో చిరస్మర ణీయులుగా నిలవడం గమనార్హం. నాటి సమాజంలో వేళ్ళూనుకున్న పితృస్వామ్యవ్యవస్థకువ్యతిరేకంగా పోరాడుతూ కుల పునాదులను



కూకటివేళ్లతో పెకిలించి అంటరాని వారిగా ముద్రవడిన మహిళలు శూద్రులహక్కుల కోసం పోరాటం చేసిన దీరవనిత. సావిత్రిబాయిపులే గొప్ప రచయిత సంస్కరణవాది సావిత్రిబాయి. పూలే స్త్రీ పురుషులు కులమతాలకు అతీతంగా చదవాలి .అందరూ సమానంగా బతకాలని అనునిత్యం తపించిన సామాజిక విప్లవ మూర్తి సావిత్రిబాయి పూలే .

మొదటి మహిళా ఉపాధ్యాయురాలు బి సావిత్రీ బాయి పూలే

సావిత్రిబాయిపూలే ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు. స్త్రీల విద్యా వ్యాప్తికి కృషి చేసిన తొలి తరం మహిళా ఉద్యమకారిణి. స్త్రీల విముక్తి కోసం అహర్నిశలు శ్రమించిన నాయకురాలు.గొప్పసంఘసంస్కర్త' రచయిత్రి' స్త్రీ' పురుషులుకులమతా లకు అతీతంగా విద్యను అభ్య సించాలని విద్య సహజమైన హక్కుగా ఉంటుందని అందుకే అందరు చదువుకోవాలని అందరు సమానంగా బ్రతకాలని నిరంతరం తపించిన సామాజిక విప్లవ మాత్రు మూర్తి పూలే.నాటి నేటికీ సమాజంలో సావిత్రిబాయి పూలే వ్యక్తిత్వం ప్రభావశీలమైంది.

సావిత్రిబాయి పూలే జననం

మహారాష్ట్రలోని సతారా జిల్లా నమ్ గావ్ లో 1831 జనవరి 3న సావిత్రిబాయి జన్మించింది.

సావిత్రిబాయి పూలే బివివాహం

1840 లో 9ఏళ్ళవయసులో సావిత్రిబాయి పూలేకు 12 ఏళ్ల జ్యోతిరావు పూలే తో వివాహం జరిగింది.ఈ వివాహం సమాజానికి గొప్ప మేలుచేసింది. సామాజిక చైతన్యానికి మేలుకొలుపు అయ్యింది.ఈ జంట పూజారికి కట్న కానుకలు లేకుండా అతి తక్కువఖర్చుతోపెళ్లిచేసుకున్నారు.

సావిత్రిబాయి పూలే విద్యాభ్యాసం

సావిత్రి బాయి పూలే విద్యాభ్యాసం పెళ్లి తర్వాత ప్రారంభమైంది. సావిత్రి బాయి పూలే చదువుకొవా నే తపనను చూసి భర్త స్వయంగా రాయడంనేర్పించాడు. సావిత్రిబాయిపూలే 4వతరగతిలోఉత్తీర్ణతసాధించింది.జ్యోతి రావు పూలే సావిత్రి బాయి పూలే కు తొలిగురువైనాడు.

జ్యోతిరావు మిత్రుల సహకారం సావిత్రిబాయి పూలే× ×విద్యాభ్యాసం

జ్యోతిరావు మిత్రులు సఖరాంయశ్వంత్ కేశవ శివరాం భావెల్కర్ సహాయముతో అహ్మద్నగర్ ఫారార్స్ సంస్థలో పూణే లోని ఓా మిచెల్ నిర్మల్ స్కూల్లో టీచర్స్ ట్రైనింగ్ స్కూల్లో సావిత్రిబాయి పూలే చదువు కోవటానికి సహకరించారు.

1847 నాటికి భర్తతో కలిసి బాలికల కోసం పూనేలో మొదటి పాఠశాల ప్రారంభించింది. పాఠశాల నడపడం కొందరికి నచ్చలేదు.

దైర్యం పట్టుదలకు నిదర్శనం బి సావిత్రిబాయి పూలే

పాఠశాల నడపడంలో సావిత్రి బాయి అనేక ఇబ్బందులకు అవమానాలకు గురైంది. శూద్రుల విద్యాభివృధికొరకు ఆమె చేస్తున్న పని నచ్చలేదు. ఆమెపై భౌతిక దాడులు చేశారు. పాఠశాలకు నడిచే దారిలో ఆమెపై బురద చల్లడం' రాళ్లు విసరడం

అసభ్య పదజాలాన్ని వాడటం అనేక ఇబ్బందులకు గురి చేశారు.

బురదతో మలినమైన చీరను పాఠశాలకు వెళ్లిన తర్వాత మార్చుకొని మళ్ళీ తిరిగి ఇంటికి వచ్చేటప్పుడు బురధ చీరకట్టుకొని వచ్చేది. ఎవరైనా అడిగినప్పుడు ధైర్యంగా నా విధిని నేను నిర్వహిస్తున్నాను అని చెప్పేది. పట్టు వీడక అవమానాలకు వెరువక వారు సాగించిన విద్యా ఉద్యమానికి తక్కువ కాలంలోనే గుర్తింపు వచ్చింది.

స్త్రీ విద్యాభివృదికి కృషి చేసిన తొలి తరం ఉద్యమకారిణి. మాంగ్ మహర్ బాలికల కోసం పాఠశాలను ప్రారంభించారు.వీరి కృషికి సమాజంనుంచిసహకారంలభించింది.

సమాజ భాగస్వామ్యంబి విద్యాభివృద్ధి

విద్యాభివృద్ధి కొరకు సావిత్రిబాయి పూలే చేసిన కృషికి సమాజం నుండి దాతల నుండి సహకారం లభించింది. విద్యాభివృద్ధిలో సమాజ భాగస్వామ్యాన్ని పెంచింది. విద్యాభివృద్ధి కొరకు మంచి ప్రోత్సహిం లభించింది. ఒకరు తమ ఇంటి ఆవరణను బడి కోసం ఇస్తే. కొంతమంది పుస్తకాలను సేకరించారు. మోరే విఠల్' వాల్వేకర్ ' దియోరావు వంటి ప్రముఖులు పాఠశాల నిర్వాహణకు సహకరించారు. 1851లో బాలికలపాఠశాల ప్రారంభించారు. బాలికల చదువు కోసం విద్యాభివృద్ధి కోసం సహకరించాలని చేసిన విజ్ఞప్తికి స్పందిస్తూ సమాజంలో చాలామంది సహకరించారు.

రైతులకోసం రాత్రి పాఠశాల

సావిత్రిబాయిపూలే దంపతులు 1855లో పూణేలో వ్యవసాయ కూలీల కోసం రాత్రి పాఠశాల ప్రారంభించారు. వ్యవసాయ వధానాల మీద అవగాహన కల్పించే వారు.

ఉపకార వేతనాలు

సావిత్రిబాయి పూలే మధ్యలో బడి మానేసిన బాలకార్మికుల కొరకు ఉపకార వేతనాలు ఇచ్చే పద్ధతిని ప్రారంభించారు.

వేగుచుక్క బిసావిత్రీ బాయి పూలే

సావిత్రిబాయి అన్ని వర్గాల మహిళలకు విద్యను అందించిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు. మూఢనమ్మకాలు రాజ్యమేలుతున్న కాలంలో వేగుచుక్కలాగ ఉదయించిన సావిత్రిబాయి పూలే నిరంతర సామాజిక చైతన్యంతో మహిళా హక్కుల రక్షణ సాధికారిత ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు .

సావిత్రీ బాయిపూలేబి విద్యా విప్లవ శక్తి

జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలే సాంఘిక విద్యా విప్లవ శక్తి వీరి ద్వారా స్ఫూర్తి పొందిన అంబేద్కర్ భారత రాజ్యాంగంలో విద్యను ప్రాథమిక హక్కుగా చేర్చడం వల్ల సమాజంలో అన్ని వర్గాల వారికి విద్య అందుబాటులోకి వచ్చింది.

పూలే దంపతులు 1848 జనవరి 1న పూణేలోని బుధవార పేటలో బాలిక పాఠశాల స్థాపించి తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా విప్లవాత్మక మార్పులకు నాంది పలికింది. సాంప్రదాయాలు అవమానాలు 'ఛీత్కారాలను స్త్రీలను బానిసలుగా చూసే పితృస్వామ్య 'పూడల్ వ్యవస్థ' ప్రగతి నిరోధక శక్తుల ను అడ్డుకొని విద్య సహజ హక్కని అందరు చదువాలని తపించిన సామాజిక విప్లవ మూర్తీ సావిత్రి బాయ్ పూలే సంకల్పించిన కార్యదీక్షతో మొక్కవోని ధైర్యంతో శూద్రులకు అతి శూద్రులకు విద్యను అందించిన విద్యా ఉద్యమ ప్రదాత . గ్రామీణ ప్రాంతాలలో బాలికలకు52 పాఠశాలలు స్థాపించి మధ్యాహ్న భోజన వసతి కల్పించి మహిళ విద్య సామాజిక సంపదగా బావించారని విజ్ఞానం వికాసం సమాజానికి వెలుగు లాంటివని 'సావిత్రి బాయి పూలే చైతన్య శక్తిగా ప్రజాతంత్ర విద్యా విప్లవ ప్రదాతగా చరిత్రలో నిలవడం గమనార్హం.

మహిళా సంఘంస్థాపన

మహిళా సేవ మండల్ పేరిట మహిళా సంఘాన్ని 1852 లో స్థాపించారు. వితంతువుల పట్ల వివక్ష 'అక్రమ సంతానం పేరిట శిశువుల హత్యలకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు నడిపారు. అనాధ బాలలు 'బాలికలు అందరూ తమ బిడ్డలేనని భావించారు. 1874లో కాశీ బాయి అనే ఒక బ్రాహ్మణ వితంతు బిడ్డను పూలేదంపతులు దత్త పుత్రుడిగా స్వీకరించారు. దీని ద్వారా సమాజానికి ప్రగతి శీల సందేశం ఇచ్చారు.అతనికి యశ్వంత్ అనే పేరు పెట్టి చదివించి డాక్టర్ ను చేశారు.

కులాంతర వివాహాలు

ముఢాచారలకు వ్యతిరేకంగా జ్యోతి రావు మరణాంతరం సత్యశోధక సమాజ ద్వారా సంస్కరణల ఉద్యమాన్ని కొనసాగించారు.

1873లో సత్యశోధక్ సమాజం మహిళావిభాగం పేరిట కులాంతర వివాహాలు జరిపించారు. భార్యని కోల్పోయిన ఒక యువకుడికి తన స్నేహితురాలి బిడ్డ తో పెళ్లి చేశారు. సావిత్రిబాయి భర్తతో పాటు తాను కూడా కష్టాల్ని అవమానాలు సహించింది. సావిత్రిబాయి ప్రపంచ చరిత్రలోనే భర్తతోపాటు ఉద్యమ జీవితంలో కలిసి నడిచిన ఆదర్శ సహచరిగా నిలిచిపోయింది. సావిత్రిబాయి తన వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసి విద్యా బోధనకు బాలికల అభివృద్ధికి అంకితమైంది. సాంఘిక దురాచారాల నిర్మూలన కోసం పెద్దలతో ఘర్షణపడినసంఘటనలు అనేకంచోటుచేసుకున్నాయి.

జ్యోతిరావు పూలే వితంతువుల వివాహాలను సమర్థిస్తే సావిత్రిబాయి పూలే బాల్య వివాహాలు సతీ సహగమనం సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా పనిచేశారు.

"ఆశ్రమాల ఏర్పాటు

అనాధ స్త్రీలకు పిల్లలకు ఆశ్రమాలు ఏర్పాటు చేశారు. సత్యశోధక సమాజంలో మహిళ విభాగం ఏర్పాటు చేసే కులాంతర వితంతువుల వివాహాలను ప్రోత్సహించారు. 1890లో భర్త జ్యోతిరావు పూలే మరణిస్తే అంత్యక్రియలు జరిపే సందర్భంలో బంధువులు' దత్తపుత్రులు ఘర్షణ పడుతుంటే తానే చితికినిప్పు అంటించారు.ఆమె తెగువకు యావత్ భారత దేశంగ్ర్భ్భంతి చెందింది.

మహిళా సాధికారితబి సావిత్రిబాయి పూలే

ఆధునిక ఆంగ్లవిద్యనుఅభ్యసించిన తొలి ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే .బోధనలో సమాజ సేవలో ముందుండేవారు .మహిళల సాధికారిత కోసం ఎనలేని కృషి చేశారు. మహిళా మండలి స్థాపించారు. మహిళా సమస్యలు హక్కులు కోసమే కాకుండా అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాటాలు చేశారు. చిన్న వయసులో భర్త చనిపోయి నిరాశ్రయులైన వారికోసం బాల హత్య ప్రతిబంధక్ పేరుతో ఒక గృహాన్ని సావిత్రిబాయి పూలే ప్రారంభించారు. ఈ గృహంలో భర్త చనిపోయిన బాల వితంతువులకు అనేకమంది అనాధలకు ఆశ్రమం కల్పించారు.

సావిత్రిబాయిపులే గొప్ప రచయిత

1854లో కావ్యపూలే అనే కవిత సంపుటిని రచించారు. అభంగ్ పేరున పుస్తకాన్ని ప్రచురించారు. ఈ పుస్తకం ఆనాటి పరిస్థితులకు అద్దం పుట్టింది. ప్రకృతి వర్ణన ప్రకృతి రక్షణ జానపదుల స్థితిగతులను విస్తృతంగా అధ్యయనం చేశారు .1891 లో ప్వాన్వాశీ శుభోద్ రత్నాకర్ 11 పేరిట ప్రచురించిన కవిత సంపుటి విద్యాభివృద్ధిపై తల్లిదండ్రులు యొక్క సమిష్టి కృషిని గుర్తించింది. శ్రీవిద్య ప్రాముఖ్యతపై కవితలు రాశారు. కుల వివక్ష మత వివక్ష

లింగ వివక్ష తాత్వికత చరిత్ర విద్య గురించి విస్తృత రచనలు చేశారు. 1893లో బాలహత్య ప్రతిభంథక్ అనే సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఇదీ దేశంలోనే మొదటిది కావడం గమనార్హం

పాతకాలపు సాంప్రదాయాలను వ్యతి రేకించి ఆధునికతవైపు సమాజాన్ని జాగృతపర్చిన సావిత్రిబాయి పూలే సంస్కరణలు వారసత్వంగా తీసుకొని నేటి తరం ముందుకు పోవాలి.

సామాజిక ఉద్యమ కారిణి× సావిత్రి బాయిపూలే అంటరానితనం 'అస్పృశ్యత 'ఆడశిషువుల హత్య' సతి' బాల్య వివాహాలు 'వైధవ్యం వితంతువుల వివాహాలు'మూఢనమ్మకాలనురూపుమాపడానికిఉద్యమాలుచేశారు .అత్యాచార బాధితులకు ప్రత్యేక సంస్థ స్థాపించారు. కార్మిక స్త్రీల హక్కుల పోరాటం లో కీలక పాత్ర పోషించారు. వారి స్ఫూర్తితో మహిళా సంఘాలు యువజన సంఘాలు సమాజంలో ఉన్న లింగ వివక్షతను' వేతన వ్యత్యాసాలను కుల వివక్షతను రూపిమాపి కుల రహిత సమాజ స్థాపనకు చేసే కృషియే సావిత్రిబాయి పూలే ఆశయాల సాధనకు నిజమైన కార్యాచరణ అని "మహిళా హక్కులే మానవహక్కులు "అని తొలిసారి నినదించిన ధీశాలి సావిత్రి బాయ్ పూలేను మహిళా లోకం స్ఫూర్తిగా తీసుకొని మహిళా వికాసానికి చైతన్యానికి మహిళా సంక్షేమానికి ఉద్యమించాలి . .

అగ్రవర్ణాల దురహంకార నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ వేళ్లూనుకున్న సామాజికఅంతరాలుదురాచారాలను అంతం చేయడానికి చివరి వరకు పోరాడిన సావిత్రిబాయి పూలేను మహిళలు 'యువత విద్యార్థులు ఆదర్శంగాతీసుకోవాలి.

ప్రభుత్వాలకుబి దిశ దశ కావాలి

స్వేచ్ఛ సమానత్వం 'సౌభ్రాతృత్వం మహిళా విద్య మహిళా హక్కులు రక్షణ అందరికీ ఉచితంగా ఉన్నత విద్య ఇవ్వాలని సావిత్రి బాయ్ చేసిన భోధనలు ప్రభుత్వాలకు నూతన దిశ దశ కావాలి . దేశ జనాభాలో 50 శాతం వున్న మహిళలకు విద్య అందించి లింగ వివక్షతను స్త్రీ పురుష అసమానతలు అంతం చేయటానికి విద్య ఆయుధం లాంటిదని బాలికలకు మహిళకు ఉచిత విద్య వృత్తి విద్యఅందించాలి.చట్టసభల్లో మహిళా రిజర్వేషన్స్ చట్టాలు అమలుచేయాలి.మహిళలో ఆర్థిక స్వశక్తి సాధికారిత సాధన కు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను ప్రభుత్వాలు అమలు చెయ్యాలి.

ప్లేగు వ్యాధి సావిత్రి బాయి మరణం

1890లో ప్లేగు వ్యాధి బారినపడిన పిల్లల కోసం వైద్య శిబిరాలను నిర్వహించారు.1896 లో ప్లేగు వ్యాధి నివారణకు విరాళాలు సేకరించారు. మహారాష్ట్రలో 52 ఉచిత ఆహార వసతి గృహాలు ఏర్పాటు చేశారు. తమ కుమారుడు యశ్వంత్ వైద్యుడిగా సేవలు అందించాడు.దుర్భరమైన కరువు పరిస్థితుల్లో కూడా రోజుకు 2000 మందికి పిల్లలకు భోజనాలు పెట్టించిన సావిత్రిబాయి పూలే 1897 వ సంవత్సరం మార్చి 10 ఒక పిల్లవాడికి సేవ చేస్తుండగా ఆమెకు ప్లేగు వ్యాధి సోకి మరణించింది.

విద్య సహజ హుక్కు

అని సమాజంలో అన్ని వర్గాలకు విద్య అందాలని సామాజిక అభివృద్ధిలో విద్య ప్రామాణికతను గుర్తించిన సావిత్రి బాయ్ పూలే ఆశయాల సాధనకు ప్రభుత్వాలు విద్యా విధానాన్ని అమలు చేయాలి.

ప్రభుత్వాలు బహుజనులకు ఉచిత విద్య అందించి సామాజిక ఉన్నతికి పాటుపడాలి.

నేదునూరి కనకయ్య రాష్ట్ర అధ్యక్షులు
తెలంగాణ ఎకనామిక్ ఫోరం
తెలంగాణ వికాన వేదిక తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరంసామాజిక ఆర్థిక అధ్యయన వేదిక 9440245771 కరీంనగర్

# బాలసదనం చిన్నారులతో నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) డిసెంబర్ 31: బుధవారం జిల్లా కేంద్రంలోని బాలసదనంలో నివసిస్తున్న చిన్నారులతో కలిసి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం చిన్నారులతో కలసి సహపంక్తి భోజనం చేసి, వారి సంక్షేమం పట్ల జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు. బాలల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా 134.9 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న బాలసదనం భవన నిర్మాణాన్ని పరిశీలించి అన్ని హంగులతో మార్చి లోగా నిర్మాణ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ ట్రైనీ రవితేజ, డిడబ్ల్యూఓ ప్రమీల, ఈఈపిఆర్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి స్రవంతి, సంబంధిత అధికారులు, బాలసదనం సిబ్బంది పాల్గొన్నారు.


# రాష్ట్ర స్థాయి ఇన్స్పైర్ అవార్డులకు ఎంపికైన భైంసా వాసవి హై స్కూల్ విద్యార్థిని.

ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 31 (భారత శక్తి): భైంసా పట్టణంలోని నరసింహ నగర్‌లో ఉన్న వాసవి హై స్కూల్ మరోసారి తన విద్యా ప్రతిభను చాటుకుంది. పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న ఆర్. కీర్తన (తండ్రి: సుభాష్) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ నిర్వహించిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన (ఎఔూఖఎఖీఇ ంలిజీతీటబ) లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు కీర్తనను అభినందిస్తూ, ఇది వాసవి హై స్కూల్‌కు గర్వకారణమని వాసవి స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ సురేందర్ రెడ్డి తెలిపారు. 25 సంవత్సరాలకు పైగా విద్యారంగంలో సేవలందిస్తున్న వాసవి హై స్కూల్ నుంచి మరో విద్యార్థిని రాష్ట్ర స్థాయికి చేరుకోవడం ఆనందదాయకమని పేర్కొన్నారు.




ఈ విజయానికి మార్గనిర్దేశం చేసిన ఉపాధ్యాయులు రమేష్, లక్ష్మణ్‌లకు పాఠశాల యాజమాన్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది. భవిష్యత్తులో మరిన్ని జాతీయ స్థాయి విజయాలు సాధించాలని కీర్తనకు శుభాకాంక్షలు తెలిపారు.

# సినిమా



## ఫిబ్రవరిలో షూటింగ్?



రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన కల్కి 2898 ఏడీ సినిమా ఎలాంటి రికార్డులు క్రియేట్ చేసిందో అందరికీ తెలిసిందే. గతేడాది జూన్ లో రిలీజైన ఈ మూవీ ₹1,100 కోట్ల కలెక్షన్లు సాధించింది. ఇక ఈ చిత్రానికి సంబంధించిన సీక్వెల్ పనులు కూడా సైలెంట్‌గానే జరుగుతున్నట్టుగా సమాచారం. దీనికి సంబంధించిన స్క్రిప్ట్ పనుల్ని నాగ్ అశ్విన్ ఆల్రెడీ పూర్తి చేసినట్టుగా తెలుస్తోంది. రాజాసాబ్ మూవీతో సంక్రాంతికి అలరించేందుకు ప్రభాస్ సిద్ధమవుతున్నాడు. ఆ తర్వాత కల్కి 2 మూవీ షూటింగ్ లో పాల్గొంటాడని సినీ వర్గాలు తెలిపాయి. ఫిబ్రవరిలో కొన్ని రోజులు ఆయన షూటింగ్ కు కేటాయిస్తాడని పేర్కొన్నాయి. ఇక ఈ మూవీలో దీపికా పదుకొణెని మార్చేసిన సంగతి తెలిసిందే. ఆ స్థానంలో ఎవరిని తీసుకుంటారనేది తెలియాల్సి ఉంది. మరోవైపు స్పిరిట్, ఫౌజీ చిత్రాల్లోనూ ప్రభాస్ నటిస్తున్నాడు. ఇంకా కొత్త ప్రాజెక్టుల్ని ఒప్పుకోకపోతే ఇదే లైన్‌లో సినిమాలు వచ్చే అవకాశం ఉంటుంది. న్యూ ఇయర్ సందర్భంగా స్పిరిట్ నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్ రావొచ్చని టాక్.

## అవన్నీ రూమర్సే



టాలీవుడ్‌లో తక్కువ సమయంలోనే ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న యువ కథానాయికల్లో మీనాక్షి చౌదరి ముందు వరుసలో ఉంటుంది. అందం, అభినయం, గ్లామర్‌ను సమతుల్యంగా ప్రదర్శిస్తూ గ్లామర్ రోల్స్‌తో పాటు కథా ప్రాధాన్యత ఉన్న పాత్రలను ఎంచుకుంటూ కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తున్న ఈ హర్యానా బ్యూటీ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉంది. ఇప్పుడు టాలీవుడ్ లో సంక్రాంతి బ్యూటీగా ఆమెకు ప్రత్యేక గుర్తింపు ఏర్పడింది. నవీన్ పోలిశెట్టి సరసన నటించిన అనగనగా ఒక రాజు మూవీ సంక్రాంతికి విడుదల కానుంది. అదే విధంగా అక్కినేని నాగచైతన్యతో కలిసి వృషకర్మ అనే చిత్రంలోనూ కీలక పాత్రలో నటిస్తోంది. ఇచ్చట వాహనములు నిలుపరాదు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఈ భామకు తొలి సినిమా విజయం అందుకోలేకపోయినా ఆమె నటనకు మంచి మార్కులు పడ్డాయి. అదే ఆమెకు అడవి శేష్ హీరోగా తెరకెక్కిన హిట్ 2లో అవకాశం తెచ్చిపెట్టింది. ఆ సినిమా సూపర్ హిట్ కావడంతో మీనాక్షి కెరీర్ ఒక్కసారిగా ట్రాక్‌లోకి వచ్చింది. ఆ తర్వాత ఆఫర్లు వరుసగా వచ్చాయి. ఇక వ్యక్తిగత విషయానికొస్తే.. హీరో సుశాంత్‌తో ఆమెకు సన్నిహిత సంబంధం ఉందని, త్వరలో పెండ్లి జరగనుందని సాగిన ప్రచారంపై క్లారిటీ ఇచ్చింది. అవన్నీ పుకార్లు మాత్రమేనని స్పష్టం చేసింది.



## 'టాక్సిక్'లో నయనతార.. ఆకట్టుకుంటోన్న లుక్



యశ్ హీరోగా మలయాళ దర్శకురాలు గీతూమోహన్ దాస్ 'టాక్సిక్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. 'ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' అనేది ట్యాగ్ లైన్. ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ సినిమాలో నయనతార లుక్‌ను టీమ్ రిలీజ్ చేసింది. ఇందులో ఆమె గంగ అనే పాత్రలో కనిపించనున్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను పంచుకున్నారు. మోడ్రన్ డ్రెస్‌లో గన్ పట్టుకొని పవర్‌ఫుల్ లుక్స్‌తో నయన్ కనిపించారు. ఈ చిత్రంలో ముగ్గురు హీరోయిన్‌లు ఉన్నట్లు మొదటినుంచి వార్తలు వస్తున్నాయి. వాటిని నిజం చేస్తూ చిత్రబృందం ముగ్గురు హీరోయిన్ల లుక్‌లను వరుసగా విడుదల చేసింది. కియారా ఆడ్వాణీ నదియా పాత్రలో కనిపించనుండగా హ్యూమా ఖురేషీ లిజబెత్ పాత్రలో అలరించనున్నారు. చిన్నారుల కోసం ఎన్నో కథలు తెరకెక్కాయని, ఇది పెద్దలకు సందేశమిచ్చే చిత్రమని యశ్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఆయన 19వ చిత్రంగా 'టాక్సిక్' తెరకెక్కుతోంది. వచ్చే ఏడాది మార్చి 19న ప్రేక్షకుల ముందుకురానుంది. 'కేజీయఫ్' తర్వాత యశ్ నటిస్తున్న సినిమా కావడంతో దీనిపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.

## అంతటా లాభం.. అక్కడ మాత్రం 'ధురంధర్'కు రూ.90 కోట్లు నష్టం



ఈ ఏడాది చివర్లో బాలీవుడ్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది 'ధురంధర్'. మామూలు అంచనాలతో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదలై భారీ వసూళ్లు సొంతం చేసుకుంది. అయితే ఒక్క ప్రాంతంలో మాత్రం ఈ సినిమా నష్టాన్ని చవిచూడాల్సి వచ్చింది. డిసెంబర్ 5న భారత్‌తో సహా.. యూరప్, ఉత్తర అమెరికా దేశాల్లో ఈ చిత్రం విడుదలైంది. కానీ, పశ్చిమాసియాలో మాత్రం దీనిపై నిషేధం విధించారు. గల్ఫ్ మార్కెట్‌లో ఈ చిత్రం విడుదల కాకపోవడంతో నష్టాన్ని చవిచూడాల్సి వచ్చింది. దాదాపు రూ.90కోట్లు నష్టం వాటిల్లినట్లు విదేశీ పంపిణీదారు ప్రణబ్ కపాడియా తెలిపారు. ''యాక్షన్ చిత్రాలు గల్ఫ్ దేశాల్లో మంచి ఆదరణను సొంతం చేసుకుంటాయి. ఈ సినిమాను కూడా అక్కడి ప్రజలు ఆదరిస్తారని విడుదల చేయాలనుకున్నాం. కానీ, మా ప్రయత్నాలు ఫలించలేదు. అక్కడ విడుదల కాకపోవడంతో సుమారు రూ.90కోట్లు నష్టపోయాం. ఈ విషయంలో ఏమీ మాట్లాడలేం. అందరి మనోభావాలను గౌరవించాల్సిన బాధ్యత మాపై ఉంటుంది'' అని ప్రణబ్ కపాడియా చెప్పారు. బహ్రెయిన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియాతో పాటు యూఏఈ లోనూ ఈ సినిమా విడుదల కాని విషయం తెలిసిందే. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా తెరకెక్కించడం వల్లే ఆయా దేశాలు దీన్ని బ్యాన్ చేసినట్లు బాలీవుడ్ మీడియా పేర్కొంది. గల్ఫ్‌లో ఎదురుదెబ్బ తగిలినప్పటికీ ఈ సినిమా ఇక్కడ మాత్రం కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. ఇప్పటివరకూ రూ.1,100 కోట్లు వసూలు చేసింది

## ఓటీటీలోకి బ్యూటీ

అంకిత్ కొయ్య, నీలఖి ప్రధానపాత్రల్లో తెరకెక్కిన మూవీ బ్యూటీ. మారుతి నిర్మించిన ఈ సినిమాకు జె. ఎస్.ఎస్. వర్ధన్ దర్శకత్వం వహించాడు. సెప్టెంబర్ 19న రిలీజై బాక్సాఫీస్ వద్ద మిక్స్‌డ్ టాక్ తెచ్చుకుంది. దాదాపు 3 నెలల తర్వాత ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేందుకు రెడీ అవుతోంది. జీ5 వేదికగా జనవరి 2 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ మేరకు సదరు ఓటీటీ సంస్థ నుంచి అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చింది. మిస్టరీగా మారే ప్రేమ కథ అంటూ ట్రైలర్‌ను షేర్ చేసింది. సినిమా కథ విషయానికొస్తే.. తండ్రీ కూతుళ్ల ఎమోషన్ ఓ వైపు... హార్ట్ టచింగ్ లవ్ స్టోరీ మరోవైపు... ఈ రెండింటి మధ్య సంఘర్షణ, దీంతో పాటే ఓ అద్భుతమైన ట్విస్ట్ ఈ మూవీలో చూపించారు. నారాయణ (నరేష్)ది మధ్య తరగతి ఫ్యామిలీ. క్యాబ్ డ్రైవర్‌గా చేస్తూ తన కుటుంబాన్ని పోషించుకుంటాడు. తన కూతురు అలేఖ్య (నీలఖి) అంటే ఆయనకు పంచప్రాణాలు. చిన్నప్పటి నుంచి ఎంతో గారాబంగా పెంచుకుంటాడు. ఇంటర్ చదివే అలేఖ్య పెట్ ట్రైనర్ అర్జున్ (అంకిత్)తో ప్రేమలో పడుతుంది. ఓ సందర్భంలో తల్లి మందలించగా ఇంటి నుంచి వెళ్లిపోతుంది. అర్జున్ ఆమెను తీసుకొని హైదరాబాద్‌కు వెళ్లడంతో.. వీరిని వెతుక్కుంటూ నారాయణ కూడా వెళతాడు. వీళ్లంతా హైదరాబాద్ చేరుకున్నాక ఏం జరిగింది? అన్నది మిగతా కథ.

## ఎన్టీఆర్‌కు ప్రైవసీ హక్కుల రక్షణ.. ఢిల్లీ హైకోర్టు ఆదేశం



ఢిల్లీ: ఎన్టీఆర్ ప్రైవసీ హక్కులకు భంగం కలగకుండా చూడాలని పలు వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ వేదికలను ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ జరిగే వరకూ కృత్రిమ మేధ, డీప్ ఫేక్‌లను వినియోగించి ఆయన పేరు, చిత్రాలను, వీడియోలను, గుర్తులను వాడవద్దని 17 సంస్థలకు జస్టిస్ మన్మీత్ ప్రీతం సింగ్ అరోడా ధర్మాసనం ఈ నెల 22వ తేదీన ఆదేశాలు జారీ చేసింది. తన అనుమతి లేకుండా తన పేరు, చిత్రాలను వాణిజ్య ప్రయోజనాల కోసం వాడుతున్నారని, దీనివల్ల తన హక్కులకు భంగం కలుగుతోందని ఎన్టీఆర్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు.. ఫిర్యాదుదారు పేరు, చిత్రాలు రక్షణ కల్పించాల్సిన అంశాల కిందకు వస్తాయని, ఆయన వ్యక్తిగత హక్కులను రక్షించాల్సి ఉందని అభిప్రాయపడింది. ఈ విషయంలో ఇంజంక్షన్ ఉత్తర్వులకు ఆయన అర్హుడేనని స్పష్టం చేసింది. దేశంలో ఆయన అందరికీ సుపరిచిత నటుడని, ఎంతో గుడ్‌విల్, గౌరవం సంపాదించుకున్నారని, సెలబ్రిటీ హోదా కలిగి ఉన్నారని అభిప్రాయపడింది. ఆయన ప్రైవసీ హక్కులను రక్షించకపోతే ఆయనకు సరిదిద్దలేని నష్టం జరుగుతుందని స్పష్టం చేసింది. వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ సంస్థలతోపాటు జాన్ డో లాంటి వ్యక్తులను (ఊరూపేరూ తెలియనివారు సెలబ్రిటీల పేర్లను దుర్వినియోగం చేసేవారు) ఆయన పేరు, చిత్రాలను వాడకుండా నిషేధించింది. తదుపరి విచారణను మే 19వ తేదీకి వాయిదా వేసింది. ఈ తీర్పుపై ఎన్టీఆర్ హర్షం వ్యక్తం చేస్తూ న్యాయ వ్యవస్థకు కృతజ్ఞతలు తెలిపారు. తన తరఫున వాదనలను వినిపించిన సుప్రీం కోర్టు న్యాయవాదులు బాలజానకి శ్రీనివాసన్, అల్కా డాకర్, రాజేందర్‌ల కృషిని కొనియాడారు.





# AGR బకాయిలు..
# వొడాఫోన్ఐడియాకు భారీ ఉపశమనం

ఢిల్లీ: అప్పుల ఊబిలో కూరుకుపోయిన టెలికాం కంపెనీ వొడాఫోన్ ఐడియాకు కేంద్ర క్యాబినెట్ భారీ ఊరట కల్పించింది. సర్దుబాటు చేసిన స్థూల ఆదాయాలకు (ఏజీఆర్) సంబంధించి రూ.87,695 కోట్ల బకాయిలను ఫ్రీజ్ చేసేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మొత్తాన్ని 203241 మధ్య చెల్లించేలా వెసులుబాటు కల్పించింది. అంటే ఈ మొత్తాన్ని వొడాఫోన్ ఐడియా ఇప్పటికిప్పుడు చెల్లించాల్సిన అవసరం లేదు. ప్రభుత్వ మద్దతు కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వొడాఫోన్ ఐడియాకు ఇది ఊరట కల్పించే అంశం. మారటోరియం పీరియడ్‌కు గానూ బకాయిలపైనా వొడాఫోన్ ఐడియా వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేదు. అంతేకాదు నిలుపుదల చేసిన బకాయిలను టెలికాం విభాగం పునః మదింపు చేస్తుంది. దీనిపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ తుది నిర్ణయం తీసుకోనుంది. 201718, 201819 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన ఏజీఆర్ బకాయిలు మాత్రం 202526 నుంచి 2030-31 మధ్య యథాతథంగా చెల్లించాల్సి ఉంటుంది. వొడాఫోన్ ఐడియాలో ప్రభుత్వానికి 49% వాటా ఉంది. దీంతో పాటు 20 కోట్ల మంది చందాదారులు ఈ నెట్‌వర్క్‌ను వినియోగిస్తున్నారు. వారి ప్రయోజనాలు, టెలికాం రంగంలో పోటీ ఉండాలన్న ఉద్దేశంతో కేబినెట్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

*** వొడాఫోన్ ఐడియా షేర్లు 15 శాతం డౌన్**

వాస్తవానికి ఈ శుభవార్త ఉంటుందని మదుపర్లు ముందుగానే ఊహించారు. దీంతో బుధవారం వొడాఫోన్ ఐడియా షేర్లు 4 శాతం మేర పెరిగి రూ.12.50 వద్ద 52 వారాల గరిష్ఠాన్ని తాకాయి. మార్కెట్ అంచనాలకు అనుగుణంగా నిర్ణయం వెలువడకపోవడంతో ఒక్కసారిగా పతనం అయ్యాయి. మొత్తం బకాయిల్లో కనీసం సగమైనా ప్రభుత్వం రద్దు చేస్తుందని మార్కెట్ వర్గాలు అంచనా వేశాయి. అంచనాలు అనుగుణంగా నిర్ణయాలు లేకపోవడంతో క్యాబినెట్ నిర్ణయం వెలువడిన వెంటనే వీఐ షేర్లు అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. మధ్యాహ్నం 2.30 గంటల సమయానికి 15 శాతం నష్టపోయి రూ.10.25 శాతం వద్ద వొడాఫోన్ ఐడియా షేర్లు ట్రేడవుతున్నాయి.



# లాభాలతో 2025కి వీడ్కోలు..
# 546 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్

ముంబయి: దేశీయ స్టాక్‌మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. నాలుగు రోజులుగా వరుస నష్టాలు చవిచూస్తున్న సూచీలు.. 2025 చివరి ట్రేడింగ్ సెషన్‌ను మాత్రం లాభాలతో ముగించాయి. ఓ వైపు విదేశీ మదుపర్ల విక్రయాలు కొనసాగుతున్నా.. మన మార్కెట్‌లో కొనుగోళ్ల ఉత్సాహం కనిపించింది. ఒక్క ఐటీ మినహా మిగిలిన అన్ని రంగాల షేర్లలో కొనుగోళ్లు నమోదయ్యాయి. దీంతో ఒక్కరోజులోనే మదుపర్ల సంపద రూ.4 లక్షల కోట్లు పెరిగింది. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.472 లక్షల కోట్ల నుంచి రూ.476 లక్షలకు కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 84,793.58 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,675.08) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 750 పాయింట్లకు పైగా లాభపడి 85,437.17 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 545.52 పాయింట్ల లాభంతో 85,220.60 వద్ద ముగిసింది. నిఫ్టీ



190.75 పాయింట్ల లాభంతో 26,129.60 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 89.88గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, రిలయన్స్, యాక్సిస్ బ్యాంక్, టైటాన్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. టీసీఎస్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్, సన్‌ఫార్మా షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 61.44 వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4321 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# గిగ్ వర్కర్ల సమ్మె వేళ ప్రోత్సాహకాలు పెంచిన స్విగ్గీ, జొమాటో!

గిగ్ వర్కర్ల దేశవ్యాప్త సమ్మె నేపథ్యంలో డెలివరీ ఏజెంట్లకు స్విగ్గీ, జొమాటో ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటించాయి. ఏడాది చివరిరోజున కార్యకలాపాలకు ఆటంకం కలగకూడదన్న ఉద్దేశంతో ప్రోత్సాహకాలను పెంచాయి. పని పరిస్థితులు, సామాజిక భద్రత వంటి అంశాలపై గిగ్ వర్కర్లు సమ్మెకు దిగిన వేళ.. ఆయా కంపెనీలు ఈ ప్రకటన చేయడం గమనార్హం. సాధారణ రోజుల కంటే పండగ, ప్రత్యేక రోజుల్లో ఆర్డర్లు పెద్ద సంఖ్యలో వస్తుంటాయి. డిసెంబర్ 31 సాయంత్రం కూడా ఈ సంఖ్య ఎక్కువగా ఉంటుంది. దీంతో సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 12 గంటల మధ్య పనిచేసే వర్కర్లకు ఒక్కో ఆర్డర్‌కు రూ.120-150 చెల్లిస్తామని జొమాటో పేర్కొంది. ఈ మేరకు వారికి సందేశాలు పంపిస్తోందని సమాచారం. ఆర్డర్, అందుబాటును బట్టి ఒక్కొక్కరూ సగటున రూ.3 వేలు ఆర్జించొచ్చని అందులో పేర్కొంటోంది. క్యాన్సిలేషన్లు, ఆర్డర్ తీసుకోకపోవడం వంటి వాటిపై పెనాల్టీలు కూడా విధించబోమని ఆ సందేశాల్లోని సారాంశం. స్విగ్గీ



సైతం దాదాపు ఇదేతరహా ఆఫర్ ప్రకటించింది. డిసెంబర్ 31, జనవరి 1న పనిచేసే వర్కర్లు పెద్ద మొత్తంలో సంపాదించుకోవచ్చని సందేశాలు పంపిస్తోంది. సాయంత్రం 6 గంటల నుంచి 12 గంటల మధ్య పీక్ అవర్స్‌లో ఒక్కొక్కరూ గరిష్ఠంగా రూ.2వేలు సంపాదించొచ్చని తెలిపింది. డెలివరీ ఏజెంట్ల సమ్మె వేళ క్విక్ కామర్స్ సంస్థ జెప్టో సైతం ప్రోత్సాహకాలు పెంచినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. న్యూ ఇయర్ వేళ అమ్మకాలకు ఆటంకం కలగకూడదన్న ఉద్దేశంతో ఆయా సంస్థలు ఈ ప్రోత్సాహకాలు ప్రకటించినట్లు తెలుస్తోంది. దీనిపై స్విగ్గీ, జొమాటో, జెప్టో అధికారికంగా స్పందించలేదు.

**సేవలపై ఎఫెక్ట్**

దేశవ్యాప్తంగా డిసెంబర్ 25న ఒకసారి సమ్మె చేపట్టిన గిగ్ వర్కర్లు.. నేడు కూడా పెద్ద సంఖ్యలో సమ్మెలో పాల్గొన్నారు. ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్ బేస్డ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్, తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు ఈ సమ్మె జరుగుతోంది. దీంతో స్విగ్గీ, జొమాటో, జెప్టో, అమెజాన్ వంటి సేవలపై ప్రభావం పడినట్లు తెలుస్తోంది. మెరుగైన వేతనాలు, సామాజిక భద్రత వంటివి వర్కర్లు కోరుతున్నారు. 10 నిమిషాల్లో డెలివరీని పూర్తిగా రద్దు చేయాలని యూనియన్ నేతలు డిమాండ్ చేస్తున్నారు.

# కార్పొరేట్ చరిత్రలో కీలక పరిణామం.. నేడు సీఈఓ పదవి నుంచి దిగిపోనున్న వారెన్ బఫెట్

ఆధునిక కార్పొరేట్ నాయకత్వ చరిత్రలో బుధవారం కీలక పరిణామం చోటుచేసుకోనుంది. ప్రపంచ దిగ్గజ ఇన్వెస్టర్ వారెన్ బఫెట్ బెర్క్‌షైర్ హాత్‌వే సీఈఓ పదవి నుంచి నేడు దిగిపోనున్నారు. బెర్క్‌షైర్‌కు సుమారు 60 ఏళ్ల పాటు సీఈఓగా వ్యవహరించిన ఆయన.. గ్రెగ్ అబెల్‌కు తన పగ్గాలు అప్పగించారు. బఫెట్ 1965లో బెర్క్‌షైర్ హాత్‌వే బాధ్యతలు స్వీకరించారు. టెక్స్‌టైల్, బీమా, రైల్‌రోడ్స్, కన్జూమర్ బ్రాండ్, ఈక్విటీల్లోకి మూలధనాన్ని మళ్లించారు. క్రమశిక్షణ, దీర్ఘకాలిక వ్యూహాలతో ఆయన అనుసరించిన మదుపు వ్యూహాలు వాటాదారులకు భారీ లాభాలను తెచ్చిపెట్టాయి. స్టాక్‌మార్కెట్ ప్రపంచంలో గొప్ప ఇన్వెస్టర్‌గా ఖ్యాతి గడించారు. పెట్టుబడులతో అపర కుబేరుడిగా మారిన ఆయన పాటించిన, చెప్పిన మదుపు సూత్రాలు పెట్టుబడిదారులకు ఆచరణీయంగా మారాయి. తాను బెర్క్‌షైర్ హాత్‌వే బాధ్యతల నుంచి తప్పుకోనున్నట్లు ఇప్పటికే బఫెట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. జనవరి ఒకటిన నూతన నాయకత్వం బాధ్యతలు చేపట్టనుంది. తన రెండో కుమారుడు హువర్డ్ బఫెట్ కంపెనీ ఛైర్మన్‌గా, గ్రెగ్ అబెల్ కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించనున్నారు.

# విజయ్ హజారే ట్రోఫీ..
# మళ్లీ ఓడిన ఆంధ్ర, హైదరాబాద్

బెంగళూరు: విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా సౌరాష్ట్రతో జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర 74 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. ఆంధ్రకు నాలుగు మ్యాచ్‌ల్లో ఇది మూడో ఓటమి. తొలుత బ్యాటింగ్ చేసిన సౌరాష్ట్ర 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 254 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో ఆంధ్ర 47.2 ఓవర్లలో 180 పరుగులకే ఆలౌటైంది. ఒక్క బ్యాటర్ కూడా కనీసం అర్ధ శతకం చేయలేదు. ఓపెనర్ సిఆర్ జ్ఞానేశ్వర్ (33) టాప్ స్కోరర్. కేఎస్ నరసింహ రాజు (30), నితీశ్ కుమార్ రెడ్డి (30), హేమంత్ రెడ్డి (29), జాగర్లపూడి రామ్ (20*) పరుగులు చేశారు. శ్రీకర్ భరత్ (4), రికీ భుయ్ (4) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. సౌరాష్ట్ర బౌలర్లలో అంకుర్ పన్వార్ (5/27) సత్తాచాటాడు. చిరాగ్ జైన్, హితేన్ కాన్బి, పార్త్ భుట్, సమర్ గజ్జర్ ఒక్కో వికెట్ తీశారు. విశ్వరాజ్ జడేజా (3), హెత్విక్ కోటక్ (7), ప్రేరక్ మన్కడ్ (13), సమర్ గజ్జర్ (0) వరుసగా పెవిలియన్‌కు చేరడంతో సౌరాష్ట్ర తొలుత తక్కువ స్కోరుకే ఆలౌటయ్యేలా కనిపించింది. 62 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయిన ఆ జట్టును ఓపెనర్ హార్విక్ దేశాయ్ (61).. ఆరు, ఏడు స్థానాల్లో వచ్చిన చిరాగ్ జైన్ (69), రుచిత్ అహిర్ (76; 54 బంతుల్లో) ఆదుకున్నారు. ఆంధ్ర బౌలర్లలో సత్యనారాయణ రాజు 3, కేఎస్ నరసింహ రాజు 2, నితీశ్ రెడ్డి, జాగర్లపూడి రామ్ చెరో వికెట్ పడగొట్టారు.

# కోమాలో ఆస్ట్రేలియా మాజీ స్టార్ క్రికెటర్



ఆస్ట్రేలియా మాజీ స్టార్ క్రికెటర్ డామియన్ మార్టిన్ ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. 54 ఏళ్ల మార్టిన్ మెనింజైటిస్ అనే వ్యాధితో బాధపడుతున్నాడు. అతడు ప్రస్తుతం బ్రిస్బేన్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్న వైద్యులు.. మార్టిన్‌కు మత్తు మందు ఇచ్చి తాత్కాలికంగా కోమాలోకి వెళ్లేలా చేశారు. మెనింజైటిస్ వల్ల మెదడు, ఇతర అవయవాలు పూర్తిగా చెడిపోకుండా ఉండేందుకు తాత్కాలికంగా కోమాలోకి పంపి చికిత్స అందిస్తున్నారు. ఆరోగ్య పరిస్థితి మెరుగుపడితే మరికొన్ని రోజుల్లో డామియన్ మార్టిన్‌ను కోమా నుంచి బయటకు తీసుకువస్తారని ఆస్ట్రేలియా మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. మార్టిన్ తొందరగా కోలుకోవాలని ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్లు డారెన్ లెహమన్, ఆడమ్ గిల్‌క్రిస్ట్ ఆకాంక్షించారు. డామియన్ మార్టిన్ ఆసీస్ తరఫున 67 టెస్టులు, 208 వన్డేలు, 4 టీ20లు ఆడాడు. ఆస్ట్రేలియా 1999, 2003 ప్రపంచ కప్ సాధించిన జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. భారత్‌తో జరిగిన 2003 వరల్డ్ కప్ ఫైనల్‌లో 88 పరుగులు చేశాడు. 2006 ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన జట్టులోనూ భాగంగా ఉన్నాడు. భారత్‌పై ఛాంపియన్స్ ట్రోఫీని గెలిచిన అత్యుత్సాహంలో మార్టిన్ పాల్పడిన ఓ దుందుడుకు చర్య.. అతడికి జీవితకాలం మర్చిపోని చేదు అనుభవాన్ని మిగిల్చింది. ట్రోఫీ ఇచ్చే సమయంలో నాటి బీసీసీఐ అధ్యక్షుడు శరద్ పవార్‌ను వేదికపై నుంచి నెట్టేశాడు. అప్పట్లో ఈ ఘటన సంచలనం సృష్టించింది.




## నాలుగు మ్యాచ్‌ల్లో మూడు సెంచరీలు..
# పడిక్కల్ వన్డేలకు ఎంపికవుతాడా?

విజయ్ హజారే ట్రోఫీలో కర్ణాటక బ్యాటర్ దేవ్‌దత్ పడిక్కల్ అదరగొడుతున్నాడు. నాలుగు మ్యాచ్‌ల్లో మూడు సెంచరీలు చేసి వన్డే జట్టు రేసులో తాను కూడా ఉన్నట్లు సెలక్టర్లకు సందేశం పంపాడు. ఇవాళ పుదుచ్చేరితో జరుగుతున్న మ్యాచ్‌లో పడిక్కల్ (113; 116 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీ చేశాడు. ఝార్ఖండ్‌తో జరిగిన మ్యాచ్‌లో కర్ణాటక 413 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడంలో ఈ కుర్రాడిదే ఇదే కీలకపాత్ర. ఆ పోరులో 118 బంతుల్లో 10 ఫోర్లు, 7 సిక్సర్ల సాయంతో 147 పరుగులు చేశాడు. కేరళపై (124; 137 బంతుల్లో 12 ఫోర్లు, 3 సిక్స్‌లు) మరోసారి శతకంలో మెరిశాడు. తమిళనాడుపై 12 బంతుల్లో 22 రన్స్ చేసి వెనుదిరిగిన దేవ్‌దత్ పడిక్కల్.. మొత్తం నాలుగు మ్యాచ్‌ల్లో 405 పరుగులు చేశాడు. పడిక్కల్ నిలకడగా ఆడతున్నందున త్వరలో కివీస్ వన్డే సిరీస్‌కు అతడి పేరును సెలక్టర్లు తప్పకుండా పరిగణనలోకి తీసుకునే అవకాశముంది. ఎందుకంటే ఒక్కసారి క్రీజులో కుదురుకుంటే భారీ ఇన్నింగ్స్‌లు ఆడే సత్తా ఇతని సొంతం. ఛేజింగ్‌లోనూ దూకుడు చూపించగలడు అనడానికి ఝార్ఖండ్‌పై ఆడిన 147 పరుగుల ఇన్నింగ్స్ నిదర్శనం. సాధారణంగా ఓపెనర్‌గా వచ్చే పడిక్కల్‌కు.. లిస్ట్‌ఏ క్రికెట్‌లో మంచి రికార్డు ఉంది. కేవలం 36 ఇన్నింగ్స్‌ల్లో 12 సెంచరీలు, 12 అర్ధ శతకాలు చేశాడు. ఈ కర్ణాటక కుర్రాడు భారత్ తరఫున ఇప్పటివరకు రెండు టెస్టులు, రెండు టీ20 ఆడాడు. వన్డేల్లో మాత్రం ఇంకా అరంగేట్రం చేయలేదు. మరి జనవరి 11 నుంచి ప్రారంభంకానున్న మూడు వన్డేల సిరీస్‌కు పడిక్కల్‌ను ఎంపిక చేస్తారో లేదో చూడాలి.



# మిథాలీరాజ్ రికార్డ్ సమం చేసిన హర్మన్ ప్రీత్ కౌర్

మాజీ క్రికెటర్ మిథాలీ రాజ్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌ల రికార్డ్‌ను భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ సమం చేసింది. శ్రీలంకతో తిరువనంతపురం వేదికగా మంగళవారం జరిగిన అయిదో టీ20 మ్యాచ్ అనంతరం హర్మన్ ఈ ఘనతను సొంతం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో ఆమె బ్యాట్‌తో రాణించింది. జట్టు సభ్యులు పరుగులు చేయడానికి ఇబ్బందిపడుతుంటే.. హర్మన్ మాత్రం హాఫ్ సెంచరీ (68; 43 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) సాధించింది. దీంతో భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 175 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 7 వికెట్లు కోల్పోయి 160 పరుగులు మాత్రమే చేయగలిగింది. దీంతో ఈ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 15 పరుగుల తేడాతో విజయం సాధించింది. హర్మన్ ప్రీత్ కౌర్ ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచింది.



ఈ సిరీస్‌ను టీమ్‌ఇండియా 50 తేడాతో కైవసం చేసుకుంది. శ్రీలంకను క్లీన్ స్వీప్ చేసి చరిత్ర సృష్టించింది.



# దళితులకు ఎక్కడా అన్యాయం జరగకూడదు

**: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**

కడప, డిసెంబర్ 31(భారత శక్తి) : దళితులకు ఎక్కడా అన్యాయం జరగకుండా చూడడమే కాకుండా జిల్లాలో సామాజిక రుగ్మతలను సమూలంగా తొలగించడమే.. విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ లక్ష్యం అని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో.. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, రాజంపేట సబ్ కలెక్టర్ భావన హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీకి సంబంధించిన కేసులలో బాధితులకు న్యాయంతో పాటు త్వరితగతిన పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. అలాగే వారికి సంబంధించిన భూ సమస్యలు ఏమైనా ఉంటే వాటిపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని కమిటీ సభ్యులైన అధికారులను ఆదేశించారు. ఈ కమిటీలో బాధితులకు పరిష్కారం అందించడం ఒక ఎత్తయితే భవిష్యత్తులో అట్రాసిటీ కేసులు నమోదు కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆ దిశగా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. దళితుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల అవకాశాలను కల్పిస్తోందని..ఎక్కడా అన్యాయానికి గురి కాకుండా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ప్రత్యేక పర్యవేక్షణ చేయడం జరుగుతోందన్నారు. సామాజిక రుగ్మతలను దూరం చేసి.. అన్ని వర్గాల ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేలా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ చేపడుతున్న చర్యలపై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులు అన్ని మండలాల్లోని ఆయా ప్రాంతాల్లోని ప్రజప్రతినిధులను సమన్వయం చేసుకుని అట్రాసిటీ కేసులు నమోదు కాకుండా అవగాహన పెంచాలన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని సాంఘిక సంక్షేమ హాస్టళ్లపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు బాల్య వివాహాలను అరికట్టే చర్యల్లో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రెవెన్యూ డివిజన్ల వారీగా ఆర్డీవోలు, డిఎస్పీలు మండల స్థాయి అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి.. ప్రజల్లో విస్తృత అవగాహన పెంచాలన్నారు. పోలీసు యంత్రాంగం ద్వారా జిల్లాలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. గత సమావేశంలో చర్చించిన విషయాలలో చాలా అంశాలను పరిష్కరించామని, పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత సమావేశంలో సభ్యులు లేవనెత్తిన అంశాలపై తదుపరి సమావేశం నాటికి పూర్తి స్థాయిలో పరిష్కరించే దిశగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం గత సమావేశంలో సంబంధిత కేసుల యాక్షన్ టేకెన్ రిపోర్టును అంశాలను సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి చదివి వినిపించగా ఆయా శాఖల నుండి హాజరైన విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులను కలెక్టర్, ఎస్పీలు వివరంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఏఎస్పీ మనోజ్ హెగ్డే, కడప, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేలు డివిజన్ల ఆర్.డి.ఓ లు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చిన్నయ్య, చంద్రమోహన్, డిఎస్పీలు, ఎస్సీ కార్పొరేషన్ ఈడి & డీఆర్డీఏ పిడి రాజ్యలక్ష్మి, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## వసతి గృహాల్లో విద్యార్థులను
# తమ పిల్లల్లాగా చూసుకోవాలి

* **నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవు**
* **రాష్ట్ర షెడ్యూల్ కులాలు, గిరిజన సంక్షేమం, -దివ్యాంగులు వయోవృద్ధులు మరియు ట్రాన్స్ జెండర్ సాధికారిక శాఖ మాత్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్.**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) డిసెంబర్ 31: జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఐడిఓసి కార్యాలయంలో భూపాలపల్లి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు, పోలీస్, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల అధికారులు, ఆర్సీఓలు, జిల్లా కోఆర్డినేటర్లు, ఎస్సి కార్పోరేషన్ ఈడీలతో వసతి గృహాలు నిర్వహణ, సౌకర్యాలు, విద్యార్థులకు వైద్య పరీక్షలు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వసతి గృహాల్లోని విద్యార్థులను తమ పిల్లల్లాగా చూసుకోవాలని, ఎలాంటి నిర్లక్ష్యం జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. వసతి గృహాల విద్యార్థుల భద్రత, విద్య, భోజనం, వైద్య సౌకర్యాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందన్నారు. జిల్లాల వారీగా విద్యార్థుల సంఖ్య, ఉత్తీర్ణత శాతం, అందుతున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉత్తమ ఫలితాల కోసం స్టడీ అవర్స్ తప్పనిసరిగా నిర్వహించాలని, విద్యార్థులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేపట్టాలని ఆదేశించారు. అనుమతి లేకుండా విద్యార్థులను బయటకు పంపకూడదని, వసతి గృహాల్లోకి బయటి వ్యక్తులు రానీయకూడదని స్పష్టం చేశారు. వసతి గృహాలలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి గ్రీన్ ఛానల్ ఏర్పాటు ద్వారా ప్రతినెల వేతనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి హాస్టల్ పర్యవేక్షణకు ప్రత్యేక పర్యవేక్షణ అధికారిని నియమించి విద్యార్థులతో మమేకమై డైట్, మెనూ, సంరక్షణ పాటించేలా చూడాలని సూచించారు. ప్రతి హాస్టల్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయాలని, షీటీమ్ ద్వారా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి స్పష్టం చేశారు.శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ వసతి గృహాల అభివృద్ధికి ఎస్ డి ఎఫ్ నుంచి రూ.6 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. మరుగుదొడ్లు, తాగునీటి సమస్యలపై శాఖల అధికారులు నివేదికలు అందించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి వైద్యానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సీసీ కెమెరాలు, భద్రతా సిబ్బంది తప్పనిసరిగా ఉండాలని, ఏజెన్సీ ద్వారా సెక్యూరిటీ సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకుంటామన్నారు. కాస్మెటిక్, డైట్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం పెంచిందని, విద్యా, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. తప్పులు జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కొరికిశాల, భూపాలపల్లి అర్బన్ పాఠశాల ఘటనపై జిల్లా కలెక్టర్ తగిన చర్యలు తీసుకున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ వసతి గృహాల్లో సౌకర్యాలు, డైట్ కాస్మెటిక్ చార్జీల పర్యవేక్షణకు మండల ప్రత్యేక అధికారులు, పోలీస్ తదితర శాఖల సమన్వయంతో నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నట్లు తెలిపారు. వరంగల్, హన్మకొండ జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరిస్, సత్య శారద, భూపాలపల్లి ఎస్పీ సంకీర్త్, ఐటిడిఏ పీఓ చిత్రామిశ్రా, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఎస్సి అభివృద్ధి శాఖ అదనపు డైరెక్టర్ సి శ్రీధర్, ఎస్సి కార్పొరేషన్ జనరల్ మేనేజర్ హన్మంతు నాయక్, గిరిజన సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ పోశం, మంత్రి ఓఎస్డీ విజయ్ కుమార్, పిఆర్వో అమృత్ తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వర్కింగ్ జర్నలిస్టులు, డెస్క్ జర్నలిస్టుల సంక్షేమమే
## టియుడబ్ల్యూజే ధ్యేయం!

* **252 జీవోపై అపోహలు వద్దు!**
* **మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి పై నిందలు తగదు!**
* **సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి**



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి,డిసెంబర్ 31 : వర్కింగ్ జర్నలిస్టులు అందరితో పాటు డెస్క్ జర్నలిస్టులందరికీ కూడా బస్ పాస్ లతో సహా, ఇతర అన్ని సంక్షేమ పథకాలు వారికి వర్తిస్తాయని టీయూడబ్ల్యూజే (ఐ జేయు) సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్, ఎలక్ట్రానిక్ విభాగం జిల్లా అధ్యక్షుడు అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఆసిఫ్ పేర్కొన్నారు. ఈ విషయంలో కొంతమంది అనేక అనుమానాలు, అపోహలు కల్పిస్తున్నారని వారు సోమవారం పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధి విషయంలో తమ సంఘం ఏనాడు కూడా వెనకడుగు వేయలేదని, రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ ఆధ్వర్యంలో నిరంతర పోరాటం చేస్తున్నామని జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి స్పష్టం చేశారు. తమ సంఘం మడమ తిప్పని పోరాటం చేయడం వల్లనే, గ్రామీణ ప్రాంత జర్నలిస్టులకు కూడా అక్రిడేషన్ కార్డులు వచ్చిన సంగతిని మరిచిపోరాదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అంతేకాకుండా బస్సు పాసులను అందరికీ ఇచ్చే విధంగా కృషి చేసింది కూడా తమ సంఘమేనని వివరించారు. జర్నలిస్టులకు హెల్త్ కార్డు లు మంజూరు చేయించింది కూడా తమ సంఘమేనని వెల్లడించారు. అర్హులందరికీ ఇంటి స్థలాలు వచ్చే విధంగా కృషి చేసిన సంగతి వర్కింగ్ జర్నలిస్టుల అందరికీ తెలుసునని యాదగిరి పేర్కొన్నారు.252 జీవో ద్వారా 13 వేల మందికి అక్రిడేషన్ కార్డులు తగ్గుతాయని పూర్తిగా అవాస్తవమని అన్నారు. కొందరు పనిగట్టుకొని చేస్తున్నందుకు ప్రచారాన్ని విజ్ఞులైన జర్నలిస్టులు ఖండించాలని కోరారు. 13వేల కార్డులు తగ్గుతాయని ఏ రకంగా లెక్క వేశారో అని ప్రశ్నించారు.ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బస్సు పాసులు పనిచేసేందుకు గతంలో పోరాటం చేశామన్నారు. అంతే కాకుండా జర్నలిస్టుల సంక్షేమం కోసం గత 70 ఏళ్లుగా పాటుపడుతున్న తమ సంఘం డెస్క్ జర్నలిస్టులకు ప్రభుత్వం అన్యాయం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని అన్నారు. బస్ పాస్ లతో సహా అన్ని సంక్షేమ పథకాలను వారికి వర్తింపజేసేందుకు తన సంఘం రాష్ట్ర నాయకులు భరోసా ఇచ్చారు. డెస్క్ జర్నలిస్టులను ఇతర జర్నలిస్టులను తాము వేరుగా చూడడం లేదని, వారికి కూడా బస్ పాస్ లతో సహా ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటిని తప్పకుండా వర్తింప చేయిస్తామని అన్నారు. గత 10 ఏళ్ల కాలంలో డెస్క్ జర్నలిస్టులకు కొంతమందికి మాత్రమే అక్రిడేషన్ కార్డులు ఇచ్చారని, కానీ ఇప్పుడు తాము డెస్క్ లో పనిచేసే జర్నలిస్టులందరికీ మీడియా కార్డులు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అంతేకాకుండా ప్రతి ఒక్కరికి హెల్త్ కార్డుతో పాటు ఇతర సంక్షేమ పథకాలను వర్తింపజేసేలా కృషి చేస్తామన్నారు. అదేవిధంగా నానాటికి జర్నలిజంలో అడుగంటుతున్న విలువలను పెంపొందించేందుకే కొన్ని కట్టుదిట్టమైన నిబంధనలతో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 252 జీవోను తీసుకొచ్చిందని ఆయన తెలిపారు. ఉనికి చాటుకోవడానికి కొన్ని సంఘాలు, డెస్క్ జర్నలిస్టులకు అన్యాయం జరుగుతుందంటూ గగ్గోలు పెడుతున్నాయని బండారు యాదగిరి అన్నారు. అబద్దాలు, కల్పితాలతో కొందరు చేస్తున్న అపోహలు నమ్మవద్దని జర్నలిస్టులను కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత జర్నలిస్టులకు ఇచ్చిన అక్రిడిటేషన్ కార్డులు ఎంతవరకు పని చేశాయో..? దానికి కారణం ఎవరన్నది ప్రతి జర్నలిస్ట్ కు తెలుసునన్నారు. జర్నలిస్టులను తీవ్ర నిర్లక్ష్యం చేసిన గత ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న సంఘాలే నేడు జర్నలిస్టులకు మేలు జరుగుతోందంటే ఓర్చుకోలేకనే రోడ్లపైకి వచ్చి ఆందోళనకు దిగుతున్నారని యాదగిరి ఎద్దేవా చేశారు. జర్నలిస్టులకు అన్యాయం జరుగుతుంటే పోరాటం చేసే ఏ సంస్థలకైనా, ఏ సంఘాల కైనా టియుడబ్ల్యూజే మద్దతు ఉంటుందని, అయితే ఆ పోరాటం సహేతుకమైనది అయి ఉండాలన్నారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రెడిటేషన్ కార్డులు అందేలా చేయడమే టియుడబ్ల్యూజే ప్రధాన ధ్యేయం అన్నారు. 1996 సంవత్సరానికి ముందు ఉమ్మడి రాష్ట్రంలో కేవలం 3 వేల అక్రిడేషన్ కార్డులు మాత్రమే ఉండేవని, ప్రభుత్వంతో కొట్లాడి గ్రామీణ విలేకరులందరికీ మండలాల వారీగా అక్రెడిటేషన్లు ఇప్పించిన చరిత్ర తమకు ఉందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 3వేల అక్రెడిటేషన్ లను 12వేలకు పెంచిన ఘనత తమ సంఘానిదేనన్నారు.


తెలంగాణ రాష్ట్రంలో దేశంలో ఎక్కడా లేని విధంగా 23 వేల అక్రెడిటేషన్ కార్డులు ఇచ్చామని గొప్పలు చెబుకుంటున్న మిత్రులు , పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా అదే సంఖ్యలో అక్రెడిటేషన్ కార్డులు ఇచ్చారన్న విషయాన్ని మర్చిపోతున్నారని గుర్తు చేశారు. కార్డుల సంఖ్య ముఖ్యం కాదని, ఆ కార్డులతో ఎన్ని సంక్షేమ పథకాలను అమలు చేసారో, వాటి కోసం ఎన్ని ఉద్యమాలు చేసారో చెబితే బాగుంటుందన్నారు. 252 జీవో తెచ్చి జర్నలిస్టులకు అన్యాయం చేస్తున్నారంటూ, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డిని విమర్శించడం సరైంది కాదన్నారు. కట్టుదిట్టమైన నిబంధనలతో 252 జీవో ను తెచ్చారని ఆయన పేర్కొన్నారు. అక్రెడిటేషన్ కార్డులతో రిపోర్టర్లకు, డెస్క్ జర్నలిస్టులకు ఇంతకాలం ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని చెప్పారు. కనీసం ఇప్పుడైనా సంక్షేమ పథకాల కోసం ప్రభుత్వం పై ఒత్తిడి పెంచి, అక్రెడిటేషన్, మీడియా కార్డులు పొందే వర్కింగ్ జర్నలిస్టులందరికీ ప్రయోజనాలు చేకూర్చేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. 252 జిఓ లో ఉన్న కొన్ని లోటు పాట్లను తమ సంఘ పెద్దలు గుర్తించినారని, వాటిని సవరించేందుకు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళనున్నట్లు ఆయన స్పష్టం చేసారు. ఏది ఏమైనా అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు, మీడియా కార్డులు అందించేందుకు తమ సంఘం తీవ్రంగా కృషి చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఇటీవల కమిషనర్ కార్యాలయం ముందు రెండు వేల మంది జర్నలిస్టులతో నిర్వహించిన మహా ధర్నాతో ప్రభుత్వం దిగివచ్చి యుద్ధప్రాతిపదికన జీవో జారీ చేసిందన్నారు. తమ సంఘ జాతీయ నాయకుడిపై దుష్ప్రచారం చేస్తూ అలజడి సృష్టించడం సహించరానిదని బండారి యాదగిరి పేర్కొన్నారు.



# గీతంలో రక్తదాన శిబిరం

* **ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ సహకారంతో నిర్వహణ**
* **140 మంది రక్తదానం**

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 31: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో బుధవారం (31122025న) రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ బ్లడ్ సెంటర్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎన్ఎస్ఎస్ అధ్యాపక, విద్యార్థి సమన్వయకర్తలతో కలిసి, గీతం హైదరాబాదు రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ ఈ శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించారు. దాదాపు 140 మంది విద్యార్థి స్వచ్ఛంద సేవకులు ఈ శిబిరంలో ఉత్సాహంగా పాల్గొని, రక్తదానం చేశారు. దాతలకు ఎన్టీఆర్ ట్రస్టు ప్రశంసా పత్రాలను ప్రదానం చేయడంతో పాటు రిఫ్రెష్ మెంట్లను కూడా అందజేసింది.ఇటువంటి నిస్వార్థ చర్యలు ప్రాణాలను కాపాడటమే కాకుండా ఇతరులు ముందుకొచ్చి సమాజ హితానికి దోహదపడేలా ప్రేరేపిస్తాయని నిర్వాహకులు విద్యార్థుల దాతృత్వాన్ని ప్రశంసించారు. రక్తదానం నిజంగా ప్రాణదానం వంటిదని, ఇది వ్యక్తులను, సమాజాన్ని బలోపేతం చేసే ఒక నిస్వార్థమైన చర్యగా వారు అభివర్ణించారు.




# ఓటర్ల మ్యాపింగ్ వారంలోపు పూర్తి చేయాలి

* **భూభారతి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 31: స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో భాగంగా చేపడుతున్న ఓటర్ల మ్యాపింగ్‌ను వేగవంతం చేసి వారం రోజుల్లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్డీవోలు, తహసిల్దార్లు, ఎన్నికల విభాగపు అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి ఓటర్ మ్యాపింగ్ పురోగతి, భూభారతి దరఖాస్తుల స్థితిగతులనుసమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ ప్రక్రియ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, బి ఎల్వోలు, బిఎల్వో సూపర్వైజర్ల సమన్వయంతో ఫీల్డ్ స్థాయిలో ఓటర్ మ్యాపింగ్ వేగవంతం చేయాలని సూచించారు.ఏ ఈ ఆర్ ఓ వారిగా రోజువారీ పురోగతి నివేదికలు తీసుకొని రెగ్యులర్‌గా సమీక్షించాలని ఆర్డీవోలకు సూచించారు. జాప్యం జరగకుండా వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూభారతి పెండింగ్ దరఖాస్తులను సత్వరంగా పరిష్కరించాలని తహసిల్దార్లకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చొరవ చూపాలన్నారు. పూర్తి పారదర్శకంగా భూభారతి చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా ప్రక్రియను పూర్తి చేయాలన్నారు.ఈ సమీక్షా సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మాధురి, సబ్ కలెక్టర్ ఉమా హారతి, రెవిన్యూ డివిజనల్ అధికారులు, తహసిల్దార్లు, ఎన్నికల విభాగపు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఒకే లాంచర్ నుంచి రెండు 'ప్రళయ్' క్షిపణులు... ప్రయోగం విజయవంతం

ఒడిశా, డిసెంబర్ 31 (భారతశక్తి): భారత రక్షణ రంగం మరో కీలక మైలురాయిని చేరుకుంది. బుధవారం ఒడిశా తీరంలో ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయోగించే స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణి 'ప్రళయ్'ను భారత్ విజయవంతంగా పరీక్షించింది. ఒకే లాంచర్ నుంచి రెండు క్షిపణులను స్వల్ప వ్యవధిలో ప్రయోగించి వాటి సామర్థ్యాన్ని విజయవంతంగా పరిశీలించారు. యూజర్ ఎవాల్యుయేషన్ ట్రయల్స్‌లో భాగంగా ఈ పరీక్షలు నిర్వహించినట్లు రక్షణ శాఖ వెల్లడించింది. బుధవారం ఉదయం 10:30 గంటల సమయంలో రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ ప్రయోగం జరిగింది. ప్రయోగించిన రెండు క్షిపణులు నిర్దేశిత మార్గంలో ప్రయాణించి, లక్ష్యాలను కచ్చితత్వంతో ఛేదించాయని అధికారులు తెలిపారు. చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్‌లో మోహరించిన ట్రాకింగ్ సెన్సార్ల ద్వారా క్షిపణి పనితీరును ధృవీకరించుకున్నారు. డీఆర్డీవో సీనియర్ శాస్త్రవేత్తలు, ఆర్మీ, ఎయిర్ ఫోర్స్ ఉన్నతాధికారులు ఈ ప్రయోగాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. 'ప్రళయ్' క్షిపణి 150 నుంచి 500 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించగలదు. ఇది పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన సాలిడ్ ప్రొపెల్లెంట్ క్వాసీ బాలిస్టిక్ మిసైల్. అత్యాధునిక నావిగేషన్, గైడెన్స్ వ్యవస్థలతో పనిచేసే ఈ క్షిపణి.. వివిధ రకాల వార్‌హెడ్‌లను మోసుకెళ్తూ శత్రువుల స్థావరాలపై విరుచుకుపడగలదు. హైదరాబాద్‌లోని రీసెర్చ్ సెంటర్ ఇమారత్ తో పాటు పలు డీఆర్డీవో ల్యాబ్స్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ వంటి సంస్థల సహకారంతో దీనిని అభివృద్ధి చేశారు. ఈ ప్రయోగం విజయవంతం కావడం పట్ల రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. సాల్వో లాంచ్ విజయవంతం కావడంతో క్షిపణి విశ్వసనీయత నిరూపితమైందని ఆయన పేర్కొన్నారు. ఈ విజయంపై డీఆర్డీవో చైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్ మాట్లాడుతూ.. త్వరలోనే ఈ క్షిపణి వ్యవస్థను సైన్యంలోకి ప్రవేశపెట్టేందుకు సిద్ధంగా ఉన్నామని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు తుది దశలో ఉన్నాయని తెలిపారు.

## 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 31 (భారతశక్తి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రైజింగ్ విజన్ 2047 లక్ష్య సాధన దిశగా పయనిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. కొత్త ఏడాది ప్రతి కుటుంబం ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. 2026 సంవత్సరంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమంలో తెలంగాణ వేగవంతమైన పురోగతిని సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 2026 నూతన సంవత్సర వేడుకలకు హైదరాబాద్ నగరం ముస్తాబైంది. నగరంలో వివిధ ప్రాంతాల్లో కొత్త సంవత్సర వేడుకలు ప్రారంభమయ్యాయి. అర్ధరాత్రి 12 గంటల వరకు వినోద కార్యక్రమాలు నిర్వహించి 2026 సంవత్సరం రాగానే పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకుంటారు. కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టబోతున్న తరుణంలో రాజకీయ, సినీ, క్రీడా ప్రముఖులు సామాజిక మాధ్యమాల వేదికగా శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

## హైదరాబాద్ లో రాత్రి 10 నుంచి ఫ్లైఓవర్లు బంద్..

హైదరాబాద్, డిసెంబర్ 31 (భారతశక్తి): న్యూ ఇయర్ వేడుకలను ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిర్వహించేందుకు హైదరాబాద్ పోలీసులు కఠినమైన ట్రాఫిక్ ఆంక్షలు అమల్లోకి తీసుకొచ్చారు. డిసెంబర్ 31 రాత్రి 11 గంటల నుంచి జనవరి 1 తెల్లవారుజామున 2 గంటల వరకు ఈ ఆంక్షలు కొనసాగనున్నాయని ఇన్‌చార్జ్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ వెంకటేశ్వర్లు వెల్లడించారు. నగరంలో భారీగా జనం కదలికలు ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బేగంపేట, టోలీచౌకీ ఫ్లైఓవర్లకు మినహాయింపు ఇస్తూ, మిగిలిన ఫ్లైఓవర్లన్నింటినీ పరిస్థితిని బట్టి రాత్రి 10 గంటల నుంచి జనవరి 1 ఉదయం వరకు మూసివేయనున్నట్లు పోలీసులు స్పష్టం చేశారు. నగరంలోకి వచ్చే అన్ని ప్రైవేటు వాహనాలను ఔటర్ రింగ్ రోడ్ మీదుగా మళ్లించాలని సూచించారు. ముఖ్యంగా ట్యాంక్‌బండ్, నెక్లస్ రోడ్, ఎన్‌టీఆర్ మార్గ్ వంటి రద్దీ ప్రాంతాల్లో రాత్రి 11 నుంచి 2 గంటల వరకు వాహనాల రాకపోకలను పూర్తిగా నిషేధించారు. భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు నగరవ్యాప్తంగా 217 ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. షాపింగ్ మాల్స్, పబ్‌లు, పార్టీ హబ్‌లుగా మారే ప్రాంతాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. పీవీ ఎక్స్‌ప్రెస్ హైవే పైకి వెళ్లాలంటే తప్పనిసరిగా ఫ్లైట్ టికెట్ చూపించాల్సిందేనని స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు రాత్రి 8 గంటల నుంచే ప్రారంభమవుతాయని, ర్యాష్ డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనపై జీరో టాలరెన్స్ విధానం అమలు చేస్తామని స్పష్టం చేశారు. నూతన సంవత్సర వేడుకలను అందరూ సురక్షితంగా ఆనందంగా జరుపుకోవాలని, పోలీసులకు సహకరించాలని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రజలను కోరారు.

## "ఏ ఫర్ ఆంధ్రా"... 'మనీకంట్రోల్' ఇదే చెబుతోంది

అమరావతి, డిసెంబర్ 31 (భారతశక్తి): ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ రాష్ట్ర సాంకేతిక ప్రగతిపై హర్షం వ్యక్తం చేశారు. ప్రముఖ ఆర్థిక వార్తా సంస్థ మనీకంట్రోల్ విడుదల చేసిన '2025 టెక్ అండ్ స్టార్టప్ గైడ్'లో ఆంధ్రప్రదేశ్‌కు దక్కిన ప్రత్యేక గుర్తింపును ఆయన సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. 2025 సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో, మనీకంట్రోల్ సంస్థ ఈ ఏడాది దేశంలోని టెక్నాలజీ, స్టార్టప్ రంగాల్లో చోటుచేసుకున్న పరిణామాలపై 'ఏ టు జడ్' (AZ) పేరుతో ఒక ప్రత్యేక నివేదికను రూపొందించింది. ఇందులో ఇంగ్లీష్ అక్షరమాల ప్రకారం ఒక్కో అక్షరానికి ఒక్కో ట్రెండ్‌ను లేదా అంశాన్ని జోడించారు. ఈ జాబితా 'ఏ' (A) అక్షరంతో మొదలవ్వగా.. దానికి 'ఏ ఫర్ ఆంధ్రా' అని నామకరణం చేయడం విశేషం. దీనిపై మంత్రి లోకేశ్ స్పందిస్తూ.. "2025 ఏ టు జడ్ జాబితా ఆంధ్రా పేరుతో మొదలైంది. భారతదేశపు నూతన టెక్ డార్లింగ్‌గా ఆంధ్రా అవతరించింది. భవిష్యత్తును నడిపించే శక్తిగా రాష్ట్రం ఎదుగుతోంది" అని పేర్కొన్నారు. రాష్ట్రంలో మారుతున్న టెక్నాలజీ ముఖచిత్రానికి, పెరుగుతున్న స్టార్టప్ ఎకోసిస్టమ్‌కు ఇది నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు. దేశీయ టెక్నాలజీ రంగంలో ఆంధ్రప్రదేశ్ కీలక శక్తిగా మారుతోందని, పెట్టుబడులకు, ఆవిష్కరణలకు రాష్ట్రం కేంద్ర బిందువుగా నిలుస్తోందని మనీకంట్రోల్ కథనం పేర్కొన్నట్లు సమాచారం. ఈ గుర్తింపు పట్ల ఐటీ వర్గాల నుంచి కూడా సానుకూల స్పందన వస్తోంది.

## కొత్త ఏడాది మీకందరికీ మంచి జరగాలి: ఏపీ సీఎం

అమరావతి, డిసెంబర్ 31 (భారతశక్తి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందుకుంటున్న లక్షలాది మంది లబ్ధిదారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ 'ఎక్స్' వేదికగా సందేశం విడుదల చేశారు. ప్రతి ఒక్కరి జీవితంలో మంచి జరగాలని ఆయన ఆకాంక్షించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని, పింఛను సొమ్మును లబ్ధిదారుల ఇళ్ల వద్దకే ఒకరోజు ముందుగా అందజేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేశంలో ఎక్కడా లేని విధంగా ఇప్పటివరకు పింఛన్ల కోసం రూ.50 వేల కోట్లకు పైగా ఖర్చు చేశామని ఆయన వెల్లడించారు. డిసెంబర్ నెలకు గాను 63.12 లక్షల మందికి పింఛన్లు అందించేందుకు రూ.2743 కోట్లను విడుదల చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సాధారణంగా ప్రతి నెల 1వ తేదీన పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా, నూతన సంవత్సర శుభ సందర్భంగా డిసెంబర్ 31వ తేదీనే ఇళ్ల వద్ద పింఛన్లు పంపిణీ చేసే ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు. పేదల జీవితాలకు ఆర్థిక భరోసా కల్పించే పింఛన్ల పంపిణీ తమ ప్రభుత్వానికి ఎంతో సంతృప్తినిచ్చే సంక్షేమ కార్యక్రమమని చంద్రబాబు నాయుడు గారు అన్నారు. మరొకసారి అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన ట్వీట్ చేశారు.

## కిటకిటలాడుతున్న వనం.. ముందస్తు మొక్కుల్లో మేడారం భక్తులు!

ములుగు, డిసెంబర్ 31 (భారతశక్తి): ములుగు జిల్లాలోని మేడారం అప్పుడే ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. వచ్చే నెల (జనవరి) 28 నుంచి నాలుగు రోజుల పాటు జరిగే సమ్మక్కసారలమ్మ మహా జాతరకు ముందే భక్తులు మేడారానికి క్యూ కడుతున్నారు. జాతర సమయంలో ఉండే విపరీతమైన రద్దీని దృష్టిలో ఉంచుకుని, ముఖ్యంగా చిన్న పిల్లలు ఉన్నవారు, వృద్ధులు ఇప్పుడే వచ్చి వనదేవతలను దర్శించుకుంటున్నారు. మేడారానికి తరలివస్తున్న భక్తులు తమ బరువుకు తూగేలా 'బంగారం' (బెల్లం) తూచి గద్దెల వద్ద సమర్పిస్తున్నారు. కోరిన కోర్కెలు తీర్చే తల్లులకు ఎదుర్కోళ్లు, యాట మొక్కులతో తమ భక్తిని చాటుకుంటున్నారు. మేడారంతో పాటు చుట్టుపక్కల 40 కిలోమీటర్ల మేర ఉండే ప్రతి చెట్టు, పుట్టను అమ్మవార్ల ప్రతిరూపంగా భావించడం ఇక్కడి విశేషం. జాతర సమయంలో అడవిలోని వన్యప్రాణులు భక్తులకు ఎలాంటి హాని చేయవనేది తరతరాలుగా వస్తున్న నమ్మకం. ఈసారి జాతరను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.251 కోట్లతో భారీ అభివృద్ధి పనులు చేపట్టింది. గద్దెల ఆధునికీకరణ, విశాలమైన క్యూలైన్లు, రాతి కట్టడాలు, రహదారుల విస్తరణతో మేడారం సరికొత్తగా కనిపిస్తోంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తలస్నానాల కోసం జంపన్న వాగు వద్ద కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. జాతర సమయంలో మేడారం చుట్టుపక్కల ఉన్న ఊరట్టం, కన్నెపల్లి, నార్లాపూర్ వంటి గ్రామాలన్నీ కలిసి ఒక పెద్ద పట్టణంగా మారిపోతున్నాయి. ఇప్పటికే అక్కడ హోటళ్లు, బిర్యానీ సెంటర్లు వెలిశాయి. ఎడ్లబండ్ల నుంచి హెలికాప్టర్ సేవల వరకు, సామాన్యుల వినోదం నుంచి విలాసవంతమైన వస్తువుల వరకు అన్నీ మేడారంలో అందుబాటులోకి వస్తున్నాయి.



## ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

బూర్గంపాడు, డిసెంబర్ 31 (భారతశక్తి): మండల పరిధిలోని పాత సారపాక గ్రామంలోని శ్రీ ఆంజనేయ ఎస్.ఆర్.వి రెస్టారెంట్ లో బుధవారం ప్రెస్ క్లబ్ ఆఫ్ మన బూర్గంపాడు వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు డొంకన చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ముందస్తుగా నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిధులుగా సారపాక మేజర్ గ్రామపంచాయితీ సర్పంచ్ గుగులోత్ కిషోర్ శివరాం నాయక్, ఉపసర్పంచ్ కన్నెదారి రమేష్, వార్డు సభ్యులు మువ్వా వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ముందుగా కేక్ కట్ చేసి ఒకరికొకరూ అడ్వాన్స్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ముఖ్యులను ప్రెస్ క్లబ్ శాలువాతో సత్కరించి పుష్ప గుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీను నిలబెట్టుకోవడానికి మా వంతు కృషి చేస్తామని అందుకు జర్నలిస్టులు తమ వంతు సహకారం అందించాలని కోరారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వాలకు మధ్య వారదులుగా జర్నలిస్టులు పనిచేస్తారని ఈ ప్రాంతంలో జర్నలిస్టులకు మీ వంతు సహకారం అందించాలని ఎల్లప్పుడూ జర్నలిస్టులు తమ వంతు సహకారాన్ని అందిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## మస్క్ మాస్టర్ ప్లాన్.. ఏఐ కంప్యూటింగ్ కెపాసిటీ ఇక 2 గిగావాట్లు

డిసెంబర్ 31 (భారతశక్తి): టెస్లా, స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ తన ఏఐ సామ్రాజ్యాన్ని మరింత వేగంగా విస్తరిస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో అగ్రగామిగా నిలిచేందుకు ఆయన స్థాపించిన 'ఎక్స్‌ఏఐ' సంస్థ తాజాగా అమెరికాలో మరో భారీ భవనాన్ని కొనుగోలు చేసింది. ఇప్పటికే మెమ్ఫిస్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న ఈ సంస్థ.. అక్కడికి సమీపంలోనే మూడో భవనాన్ని కూడా సొంతం చేసుకుంది. ఈ కొత్త భవనానికి 'మాక్రోహార్డర్' అని పేరు పెట్టినట్లు మస్క్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. ఈ కొనుగోలుతో తమ ఏఐ ట్రైనింగ్ కంప్యూటింగ్ సామర్థ్యం దాదాపు 2 గిగావాట్లకు చేరుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. సాధారణంగా ఒక గిగావాట్ విద్యుత్ సుమారు 7.5 లక్షల ఇళ్లకు సరిపోతుంది. దీన్ని బట్టి మస్క్ ఏఐ డేటా సెంటర్ల సామర్థ్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. మిసిసిపీలోని సౌత్‌హెవెన్‌లో ఉన్న ఈ కొత్త భవనం.. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న 'కొలోసస్ 2' ఫెసిలిటీకి ఆనుకుని ఉంది. ఇప్పటికే మస్క్ మెమ్ఫిస్‌లో 'కొలోసస్' పేరుతో ఒక డేటా సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్‌ను నిర్మించాలన్నది మస్క్ లక్ష్యం. ఇందులో భాగంగా భవిష్యత్తులో 5,50,000 ఎన్విడియా చిప్‌లను వినియోగించనున్నట్లు ఆయన గతంలోనే ప్రకటించారు. మరోవైపు, ఎక్స్‌ఏఐ సంస్థ విలువను 230 బిలియన్ డాలర్లుగా లెక్కగడుతూ భారీగా నిధుల సమీకరణకు మస్క్ చర్చలు జరుపుతున్నారు. ఇటీవల కోర్టు తీర్పుతో టెస్లా స్టాక్ ఆప్షన్లు తిరిగి మస్క్ చేతికి రావడంతో.. ఆయన సంపద ఏకంగా 750 బిలియన్ డాలర్లకు చేరింది. దీంతో ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్‌గా అవతరించే దిశగా మస్క్ దూసుకుపోతున్నారని ఫోర్బ్స్ అంచనా వేసింది. ఇదే సమయంలో వికీపీడియాపై మస్క్ మరోసారి సెటైర్లు వేశారు. వికీపీడియా పక్షపాత ధోరణితో ఉందని, దానికి ప్రత్యామ్నాయంగా తాము తీసుకొస్తున్న 'గ్రోక్‌పీడియా' మరింత కచ్చితత్వంతో, విస్తృత సమాచారంతో ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

## టెన్త్ లో ఉత్తమ గ్రేడ్లు సాధించాలి: ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్



మణుగూరు, డిసెంబర్ 31 (భారతశక్తి): గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతి చదివే విద్యార్థినీ విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ గ్రేడ్లు సాధించి మీ తల్లిదండ్రులకు, పాఠశాలకు, మీ గ్రామానికి మంచి పేరు తీసుకొని రావాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ విద్యార్థినీలకు సూచించారు. బుధవారం మణుగూరు మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించి గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఉన్నత పాఠశాల, తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ముందుగా గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ బాలికల పాఠశాలను సందర్శించి, ప్రైమరీ, పదో తరగతి విద్యార్థినిలతో ప్రత్యేకంగా తరగతి గదిలో ఉద్దీపకం వర్క్ బుక్ లోని అంశాల గురించి ప్రైమరీ విద్యార్థినిలతో బోర్డుపై వ్రాయించి వారికి పలు సూచనలు చేశారు. అనంతరం పదవతరగతి విద్య విద్యార్థినిలతో ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు అనేవి మీ జీవితానికి ఎంతో ముఖ్యమైనవని, అందుకు విద్యార్థినిలు ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను శ్రద్ధగా విని అర్థం చేసుకొని మరల మననం చేసుకుంటూ కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. గత సంవత్సరం ఈ పాఠశాలలో చదివిన పదవ తరగతి విద్యార్థినిలు 99% గ్రేడ్ సాధించారని, ఈ సంవత్సరం 100% గ్రేడ్ వచ్చేలా విద్యార్థినిలు కంకణం కట్టుకోవాలన్నారు. సబ్జెక్ట్ టీచర్లు విద్యార్థినిలు ఏ సబ్జెక్టులు అయితే వెనుకబడి ఉన్నారో వారిపై ప్రత్యేక దృష్టి సారించి అదనపు పీరియడ్లు తీసుకొని పరీక్షలు నాటికి వారు పూర్తిస్థాయిలో ప్రతి సబ్జెక్టుపై భయం లేకుండా పరీక్షలు రాసేలా చూడాలని అన్నారు. అనంతరం పాఠశాలలో మెన్స్ పార్క్ కంప్యూటర్ లో పిల్లలు పదాలకు సంబంధించిన మ్యాపింగ్ ఎలా చేస్తున్నారో పరిశీలించారు. పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం పనులను పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తిచేసి మార్చి 31 నాటికి పూర్తిగా అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి అయ్యేలా చూడాలని ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్ కు ఫోన్ ద్వారా ఆదేశించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఓటర్ లిస్ట్ కు సంబంధించిన అంశాలను పరిశీలించి ఓటర్ లిస్టులో ఫ్యామిలీ మెంబర్స్ మ్యాడింగ్, మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. కుటుంబంలోని సభ్యుల అందరి పేర్లు సక్రమంగా నమోదు చేయాలని తహశీల్దార్ నరేష్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మహాలక్ష్మి, మణుగూరు తహశీల్దార్ అద్దంకి నరేష్, సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భూగర్భ దోపిడి.. అరికట్టేవాడేడి..?

- తెలంగాణ రాష్ట్రంలో అంతులేని అక్రమ మైనింగ్...
- ఇంత దోపిడీ జరుగుతుంటే పాలక వ్యవస్థ ఏమి చేస్తోంది..?
- ప్రభుత్వాలే ఈ దోపిడీలో భాగస్వాములైయ్యారు..?
- కంచె చేనును మేస్తుంటే ఇక కాపాడేదెవరు..?
- కోట్లలో ప్రజా సంపదను కొల్లగొడుతున్నారు..
- అనుమతులు లేకుండానే తవ్వకాలు, బ్లాస్టింగులు..
- చెలరేగిపోతున్న మైనింగ్ మాఫియా..
- ఎవరైనా ఎదురొస్తే ప్రాణాలు కూడా తీస్తారు..
- పర్యావరణాన్ని నాశనం చేస్తున్న దౌర్భాగ్యపు సంస్కృతి..
- మైనింగ్ మాఫియాపై " ఫోరమ్ ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ " అందిస్తున్న ప్రత్యేక కథనం..



**(స్పెషల్ కరస్పాండెంట్)**

**హైదరాబాద్, జనవరి 01 (భారత శక్తి ) :** అసలు ఈ అక్రమ మైనింగ్ ఎలా జరుగుతోంది? నిజానికి అక్రమ మైనింగ్ అనేది ఇప్పుడు రాత్రిపూట ట్రాక్టర్లు తిప్పే చిన్నపాటి పని కాదు.

ఇది ఒక భయంకరమైన పెద్ద నెట్‌వర్క్. నిబంధనలకు విరుద్ధంగా లీజుల విస్తరణ జరుగుతోంది..అనుమతించిన పరిమితికి మించి తవ్వకాలు జరుగుతున్నాయి.. నిషేధిత ప్రాంతాల్లో మైనింగ్ చేస్తున్నారు.. నకిలీ రాయల్టీ రసీదులు.. పోలీసు చెక్‌పోస్టుల వద్ద "సెటిల్మెంట్" ఇవి అన్నీ కలిసి అక్రమ మైనింగ్‌ను బహిరంగ రహస్యంగా మార్చాయి.



**ఏ ప్రాంతాల్లో ఎక్కువగా జరుగుతోంది..?**

ముఖ్యంగా తెలంగాణాలో నల్లగొండ, యాదాద్రి, గ్రానైట్, రాయి తవ్వకాలు విపరీతంగా జరుగుతున్నాయి.. ఖమ్మం, మహబూబాబాద్జిల్లాల్లో ఇసుక అక్రమ రవాణా.. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో మట్టి, క్వార్ట్జ మైనింగ్.. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలలో బొగ్గు అనుబంధ అక్రమాలు యధేచ్ఛగా జరుగుతున్నాయి.. గ్రామాల మధ్య రహదారులు పాడవుతుంటే, నదీ గర్భాలు ఖాళీ అవుతుంటే, పంట భూములు నశిస్తుంటే... అధికార యంత్రాంగం మాత్రం లంచాలు బుక్కుతూ ఫైళ్లలో నిద్రపోతోంది.

**పర్యావరణంపై విపరీతమైన ప్రభావం :**

అక్రమ మైనింగ్ వల్ల నదుల ప్రవాహ మార్గాలు మారిపోతున్నాయి.. భూగర్భ జలాలు ప్రమాదకరంగా అంతరించిపోతున్నాయి.. వ్యవసాయ భూములు బీడుగా మారుతున్నాయి.. ఇక గ్రామాల్లో తాగునీటి సంక్షోభం పెరుగుతోంది.. అడవులు, వన్యప్రాణులు నాశనానికి గురవుతున్నాయి.. ఇది భవిష్యత్తు తరాలకు కొందరు దుర్మార్గులు మిగిల్చే విపత్తుగా చెప్పుకోవచ్చు..

*** అధికారుల నిర్లక్ష్యమా? లేక అవినీతిలో భాగస్వామ్యమా? :**

ప్రజల మనస్సులో తలెత్తుతున్న ప్రధాన ప్రశ్న ఇదే. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో కనిపించరు.. మైనింగ్ శాఖ తనిఖీలు కాగితాలకే పరిమితం అవుతోంది.. పోలీసులు కేసులు నమోదు చేసినా త్వరలోనే నీరుగారిపోతాయి.. జిల్లా స్థాయి కమిటీలు సమావేశాలకే పరిమితం అవుతున్నాయి.. అన్నీ తెలుసు... కానీ ఏమీ చేయలేం.. అన్న ధోరణి పాలక వ్యవస్థలో నాటుకుపోయింది. ఇది అత్యంత దురదృష్టం..

**ప్రభుత్వానికి నష్టం ఎంత? :**

విశ్లేషకుల అంచనాలు, లెక్కల ప్రకారం.. ప్రతి ఏడాది వందల కోట్ల రూపాయల రాయల్టీ నష్టం జరుగుతోంది.. అక్రమ రవాణా వల్ల పన్నుల ఎగవేత జరుగుతోంది.. రోడ్ల మరమ్మతులకు అదనపు భారం పడుతోంది.. అంటే అక్రమ మైనింగ్ అనేది.. ప్రజల సొమ్ము దోపిడీ..

**అభివృద్ధికి అడ్డంకి..**

ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏమైనా ఉన్నాయా..? అంటే :ప్రత్యేక టాస్క్ ఫోర్సుల ఏర్పాటు చేశామంటున్నారు.. డ్రోన్ల ద్వారా మైనింగ్ ప్రాంతాల పర్యవేక్షణ జరుగుతోంది అని అధికారులు చెబుతున్నారు.. ఆన్‌లైన్ ట్రాకింగ్ సిస్టమ్.. అక్రమ లీజుల రద్దు.. కొంతమంది అధికారులపై సస్పెన్షన్లు అని వార్తలు వింటున్నాం.. చూస్తున్నాం.. కానీ ఇవి తూ తూ మంత్రంగానే జరుగుతున్నాయి అన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**అసలు చేయాల్సింది ఏమిటి..?**

నిపుణుల కొన్ని విలువైన సూచనలు చేస్తున్నారు.. రాజకీయ జోక్యం లేకుండా కఠిన చర్యలు.. మైనింగ్ శాఖకు స్వతంత్ర అధికారాలు కల్పించాలి.. గ్రామస్థాయిలో ప్రజా పర్యవేక్షణ జరగాలి.. జైలుశిక్షతో సహా కఠిన శిక్షలు అమలు చేయాలి.. అక్రమ మైనింగ్‌ను నాన్‌బెయిలబుల్ నేరంగా ప్రకటించాలి..

నిజానికి తెలంగాణ భూమి అమ్ముడుపోయే సరుకు కాదు...నదులు మాఫియాల ఆస్తులు కావు.. అక్రమ మైనింగ్‌పై ప్రభుత్వం నిజంగా యుద్ధం చేస్తే, అది ఫైళ్లలో కాదు, క్షేత్రస్థాయిలో కనిపించాలి. లేకపోతే చరిత్ర ఒకే ప్రశ్న అడుగుతుంది: మీకు అన్నీ తెలుసు...కానీ ఎందుకు ఆపలేకపోయారు? అని.. సమాధానం చెప్పగలరా..?



లింగోజిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ జిహెచ్ఎంసి ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు కందికంటి శ్రీధర్ గౌడ్ ఆధ్వర్యంలో రాజశేఖర్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి వంద మంది బీదవారికి చీరలు పంచారు. అలాగే మైనారిటీ సోదరులు, పెద్దలు వారికి ఆశీర్వాదం అందించారు. అలాగే శుభాకాంక్షలు తెలిపి వినాయకుడి ప్రతిమ బహుకరించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ సీనియర్ మహిళా కార్యకర్తలు, డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్, డిసెంబర్ 31(భారత శక్తి ):




గడ్డిఅన్నారం మున్సిపాలిటీ కురుమ సంఘం ఆధ్వర్యంలో ప్రచురించిన నూతన సంవత్సర క్యాలెండరును (2026) వనస్థలిపురంలో వారి నివాసంలో ఆవిష్కరించిన కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు క్యామ మల్లేష్.ఈ కార్యక్రమంలో పాల్గొన్న బైర శంకర్, సమ్ము రాములు, మల్లేష్,అభిలాష్ తదితర కురుమ సోదరులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్, డిసెంబర్ 31 (భారత శక్తి):






## బాల కార్మికులను నిర్మూలించడానికి సమాజం బాధ్యత తీసుకోవాలి

మల్కాజ్ గిరి, డిసెంబర్ 31 (భారత శక్తి): సంతోషంగా చదువుకుంటూ, ఆడుకుంటూ ఉండాల్సిన పిల్లల బాల్యాన్ని పాడుచేసే బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని,పిల్లల బాల్యాన్ని నాశనం చేసే బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కఠినమైన చర్యలు తీసుకోవాలని శ్రీమతి ఉషా డీసీపీ మహిళా భద్రతా విభాగం మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ పిలుపునిచ్చింది. ఆపరేషన్ స్మైల్ 12 యొక్క కన్వర్జెన్స్ సమావేశం బుధవారం మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నెరెడ్‌మెట్‌లో జరిగింది.ఈ కార్యక్రమంలో పోలీస్, చైల్డ్ వెల్ఫేర్, విద్య, ఆరోగ్యం, కార్మిక శాఖలు, ఎన్జీఓలు, ఆపరేషన్ స్మైల్ బృందాల అధికారులు పాల్గొన్నారు.

## జగ్గారెడ్డి స్వగృహం లో కన్నుల పండుగగా సత్యనారాయణ స్వామి కథ, అయ్యప్ప మహా పడి పూజ

- **పూజలో పాల్గొన్న దంపతులు జయా-గుణ దత్తు, జగ్గారెడ్డి, నిర్మల**
- **ప్రతీ ఏటా డిసెంబర్ 31 న జగ్గారెడ్డి స్వగృహం లో ఆనవాయితీగా సత్యనారాయణ స్వామి కథ, అయ్యప్ప మహాపడి పూజ**
- **పెద్ద ఎత్తున పాల్గొన్న అయ్యప్ప స్వాములు, భక్తులు, నాయకులు, కార్యకర్తలు**



సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 31 : సంగారెడ్డి పట్టణం లోని రామ్ నగర్ రామ్ మందిర్ వద్ద జగ్గారెడ్డి స్వగృహం లో సత్యనారాయణ కథ, అయ్యప్ప మహా పడి పూజ ఘనంగా జరిగాయి. పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ప్రతీ ఏటా డిసెంబర్ 31 న ఆనవాయితీగా ఈ పూజలను జగ్గారెడ్డి నిర్వహిస్తుంటారు. ప్రతీఏడు మాదిరిగానే ఈ సారి సైతం ఈ పూజలు కన్నుల పండుగగా జరిగాయి. ఉదయం 10 గంటలకు సత్యనారాయణ స్వామి కథ తో ప్రారంభమయ్యే ఈ పూజ కార్యక్రమాల్లో మధ్యాహ్నాము అయ్యప్ప పూజ, సాయంత్రం మొదలుకుని అర్ధరాత్రి వరకు మహా పడి పూజా కార్యక్రమాలు ఉంటాయి. ఈసారి ప్రత్యేకంగా మధ్యాహ్నాము యోగిని పుష్పార్చన, రుద్రాభిషేకాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ భజన బృందాల చే ఏర్పాటు చేసిన భజనలు భక్తులను అలరించాయి. ఈ పూజా కార్యక్రమాల్లో జగ్గారెడ్డి కుమార్తె , అల్లుడు జయా గుణ లతో పాటు కుమారుడు దత్తు, జగ్గారెడ్డి, నిర్మల పాల్గొన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.